విశాఖపట్టణం
గురువారం 29 జనవరి 2026

For a pure tomorrow..

# జయ జయహే

jayajayahey.in | సంపుటి: 9 | సంచిక: 5 | వెల: రూ.5/- | పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

లక్ష్మీవారము, జనవరి 29, 2026 (బృహస్పతి వాసరే)
భీష్మ ఏకాదశి, మతత్రయ ఏకాదశి
సూర్యోదయం: 06:35, సూర్యాస్తమయం: 5:57
విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘమాసం, శుక్లపక్షము
తిథి: ఏకాదశి మ.01.56 వరకు తదుపరి ద్వాదశి
నక్షత్రం: రోహిణి ఉ.07.32 వరకు తదుపరి మృగశిర శుక్రవారం తె. 5.29 వరకు తదుపరి ఆరుద్ర
యోగం: ఐంద్రం రా.08.27 వరకు, , కరణం: భద్ర మ.01:56 వరకు,
రాహుకాలం: మ.1.30 నుండి మ.03.00 వరకు, యమగండం: ఉ.06:00 నుండి ఉ.07:30 వరకు
గుళిక: ప.09:00 నుండి ప.10:30 వరకు, వర్జ్యం: మ.12.39 నుండి మ.02.07
అమృతం: రా.09.26 నుండి ఉ.10.54 వరకు,
దుర్ముహూర్తం: ప.10.22 నుండి ప.11.07 వరకు, మ.2.55 నుండి మ.3.40 వరకు
అభిజిత్: మ.12.04 నుండి మ.12.48 వరకు

డా॥ నిట్టల వి ఎస్ ఆర్ కృష్ణ ప్రసాద్ జ్యోతిషం వాస్తు శిక్షణ పరిశోధన
శ్రీనిట్టల వారి పంచంగకర్త,శ్రీపరాశర జ్యోతిర్వాస్తు విద్యాపీఠ్
9618877666, 7901677666



# దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

**కల్తీ నెయ్యిలో వాస్తవాలు చెప్పాలి**
**వైసీపీ నేరప్రవృత్తిని ప్రజలకు తెలపాలి**
**సిట్ నివేదిక వచ్చాక వాస్తవాలు బట్టబయలు**
**కేబినెట్‌లో మంత్రులకు సీఎం బాబు దిశానిర్దేశం**

(అమరావతి, జయజయహే)

సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ మీటింగ్‌లో టీటీడీ నెయ్యి కల్తీ నివేదికపై చర్చ జరిగింది. నెయ్యి కల్తీపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారంపై కేబినెట్ మీటింగ్ లో మంత్రులు పలు విషయాలను సీఎంకు వివరించారు. అప్పటి టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్న అప్పన బ్యాంకు అకౌంట్ లో రూ.4.50 కోట్లు జమ అయ్యాయని మంత్రులు అన్నారు. అధికారులు కూడా సీఎంకు పలు విషయాలను వెల్లడించారు. వైసీపీ ..మిగతా 2లో

# ఇప్పడేం.. ఏం చెప్తారు..?

**గీతం భూ దోపిడీపై సమాధానమేదీ**
**సీఎం చంద్రబాబు స్పందించాలి**
**నీతులు చెప్పే పవన్ ఏమంటారో**
**కూటమి పక్షాలు కూడా ఆలోచించాలి**
**సమర్థిస్తారా.. వ్యతిరేకిస్తారా.. తేల్చి చెప్పండి**
**శాసన మండలి విపక్ష నేత బొత్స డిమాండ్**






(విశాఖపట్నం - జయజయహే)

విశాఖలో సీఎం చంద్రబాబు కుటుంబం భూదోపిడీకి పాల్పడుతోందని శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్షలాది ఫీజులు వసూలు చేస్తూ...54.79 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా చేసిన గీతం విద్యాసంస్థలకు ఈ భూమని అడ్డగోలుగా రెగ్యులరైజ్ చేయడానికి సిద్ధమైన ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పు పట్టారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. ఇవాళ వైయస్సార్సీపీ ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లతో కలిసి విశాఖ జీవీఎంసీ కమిషనర్, మేయర్ లకి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం తని నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే... రాజకీయ పార్టీలు, మేధావులతో కలిసి పోరాడుతామని తేల్చి చెప్పారు. మరోవైపు కూటమిలో భాగస్వామ్యులుగా ఉన్న బీజేపీ నేతలతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా దీనిపై స్పందించాలని డిమాండ్ చేశారు విశాఖపట్నంలో రూ.5వేల కోట్ల విలువైన 54.79 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి.. దాన్ని రెగ్యులరైజ్ చేయడం ద్వారా ఎంపీ భరత్ చేస్తున్న భూదోపిడీకి వ్యతిరేకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆందోళనకు సిద్ధమైంది. దీనికోసం ఒక కార్యాచరణ రూపొందించాం. అందులో బాగంగానే ఇవాళ విశాఖ జీవీఎంసీ మేయర్, కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతిపత్రం సమర్పించి.. ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న భూదోపిడీని ఆపాలని విజ్ఞప్తి చేశాం. గీతం విద్యాసంస్థల కబ్జాలో ఉన్న ప్రభుత్వ భూమిని.. వారికి రెగ్యులరైజ్ చేసే ప్రతిపాదనను ఈ నెల 30 వ తేదీన జరగనున్న జీవీఎంసీ కౌన్సిల్ మీటింగ్ అజెండాలో పెట్టొద్దని కోరాం. నగరంలో మేధావులు సైతం ఈ భూదోపిడీని ..మిగతా 2లో

# జనసేన ఎమ్మెల్యే కీచక పర్వం

**కూటమి ఎమ్మెల్యేలు మహిళల జీవితాలతో ఆడుకుంటున్నారు**
**మహిళల జోలికి వస్తే తాట తీస్తానన్న పవన్ కళ్యాణ్ నోరు మెదపడం లేదు**
**మహిళా హోం మంత్రి ఉన్న రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు**
**అరవ శ్రీధర్‌పై సుమోటో కేసు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలి**
**ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి డిమాండ్**
**మహిళలకు న్యాయం జరిగే వరకు వైయస్ఆర్‌సీపీ పోరాటం చేస్తామని స్పష్టీకరణ**



తాడేపల్లి: (జయ జయహే)

మహిళా ఉద్యోగినిపై ఏడాదిన్నర కాలంగా అత్యాచారం, బెదిరింపులు, మానసిక హింసకు పాల్పడిన రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ చర్యలు అత్యంత దుర్మార్గమని వైయస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి మండిపడ్డారు. తాడేపల్లిలోని వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆమె, కూటమి ప్రభుత్వంలో మహిళలకు ..మిగతా 2లో

# నయీం గ్యాంగ్‌పై ఈడీ నజర్

**కోర్టులో చార్జిషీటు దాఖలు**
**91 ఆస్తుల జప్తునకు సన్నహాలు**

(హైదరాబాద్ - జయజయహే)



రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన గ్యాంగ్‌స్టర్ నయీం అక్రమాస్తుల కేసు లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మనీలాండరింగ్ ఆరోపణలపై సుదీర్ఘంగా దర్యాప్తు జరిపిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు.. తాజాగా హైదరాబాద్‌లోని రంగారెడ్డి కోర్టులో ఛార్జిషీట్‌ను దాఖలు చేశారు. మనీ లాండరింగ్ నివారణ చట్టం-2002 కింద ఈడీ ఛార్జిషీట్‌ను తయారు చేసింది. ఆ ఛార్జిషీటును పరిగణలోకి తీసుకుని పరిశీలించిన కోర్టు విచారణకు స్వీకరించింది. నయీం తన గ్యాంగ్‌తో ..మిగతా 2లో



# రాజకీయాల్లోకి బొత్స కుమార్తె..?

**చీపురపల్లి బరిలో నిలిచేందుకు అనూష ఎత్తులు**
**తండ్రి స్థానంను పదిలం చేసుకునే యత్నాలు**
**రాజ్యసభకు వెళ్లే ప్రయత్నాల్లో సత్తిబాబు**


(విజయనగరం - జయజయహే)

సీనియర్ నేత బొత్స సత్యనారాయణ తన రాజకీయ వారసత్వాన్ని రంగంలోకి దించుతున్నారు. బొత్స కుమారుడు ఆయన వారసుడిగా వస్తారని అనుకున్నారు. కానీ అనూహ్యంగా ఆయన కుమార్తె తెరపైకి వచ్చారు. ఇప్పటికే ఆమె తండ్రి వెంట రాజకీయ సమావేశాలకు హాజరవుతున్నారు. బొత్స సత్యనారాయణ.. ఉమ్మడి ఏపీలో కానీ ఇప్పుడు ప్రస్తుత రాష్ట్రంలో కానీ సీనియర్ రాజకీయ నేతల్లో ఒకరు. ఐదుసార్లు మంత్రిగా పనిచేసిన ..మిగతా 2లో

## విమాన ప్రమాదంలో అజిత్ పవార్

# దుర్మరణం

**ఉప ముఖ్యమంత్రి మరణంతో మహా రాజకీయాల్లో తీరని విషాదం**
**పవార్‌తో పాటు ఇద్దరు సహాయకులు పైలెట్లు మృతి**



ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

మహారాష్ట్ర రాజకీయాల్లో తీరని విషాద ఘటన చోటు చేసుకుంది. ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ అనంతరావు పవార్ బుధవారం బారామతి దగ్గర చార్టర్డ్ విమానం కూలిపోవడంతో దుర్మరణం చెందారు. ఈ ఘటనలో ఆయనతోపాటు విమానంలో ఉన్న మరో నలుగురు కూడా ప్రాణాలు కోల్పోయారు. ముంబై నుంచి బారామతి వెళ్తున్న ప్రైవేటు ఎయిర్‌క్రాఫ్ట్ ఉదయం 8:45 గంటల సమయంలో క్రాష్ అయినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. అజిత్ పవార్ (66) సంవత్సరాలు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ ప్రయాణిస్తోన్న విమానం బారామతిలో ల్యాండ్ అయ్యే సమయంలో కుప్పకూలినట్టు తెలుస్తోంది. కూలిన వెంటనే ..మిగతా 2లో

# కూటమి నేతల బరితెగింపు

**రాష్ట్రంలో శాంతి భద్రతలు కుప్పకూలాయి**
**రైల్వేకోడూరు ఎమ్మెల్యే వ్యవహారంపై జగన్ ఆగ్రహం**
**ఇలాంటి ఘటనలు సాగుతున్న చర్యలు లేవంటూ విమర్శలు**

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:



రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ ఘటనపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్ర స్థాయిలో స్పందించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా కుప్పకూలి పోయాయని, ఆంధ్రప్రదేశ్ జంగిల్‌రాజ్‌గా మారిందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అసలు, మనం ఏ సమాజంలో ఉన్నావె అర్థం కావడం లేదన్నారు. బరితెగింపునకు అడ్డుకట్ట లేకుండా ..మిగతా 2లో

# ఇప్పుడేం.. ఏం చెప్తారు..?

**మొదటి పేజీ తరువాయి...**

వ్యతిరేకిస్తున్నారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉంటూ... నిష్పక్షపాతంగా పరిపాలన చేస్తానని ప్రమాణం చేసిన చంద్రబాబు నాయుడు, ఆయన కుటుంబ సభ్యులు ఇలా భూదోపిడీకి పాల్పడ్డం దుర్మార్గం. అందుకే ఇవాళ అధికారులకు వినతి పత్రం సమర్పించి.. భూదోపిడీని ఆపాలని కోరాం. రేపు వైయస్సార్సీపీ నేతలంతా గీతం సంస్థల కబ్జాలో ఉన్న 54 ఎకరాల స్థలాన్ని కూడా పరిశీలిస్తాం. మరలా 30 వ తేదీన జరగబోయే జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఈ భూమి రెగ్యులరైజ్ చేయాలన్న ప్రతిపాదనకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తాం. ప్రభుత్వం తన ప్రతిపాదనను వెనక్కి తీసుకుంటే తప్ప... పోరాటం ఆగదు. మరింత ఉధృతంగా పోరాటం కొనసాగిస్తాం అని బొత్స స్పష్టం చేసారు.

అధికార పార్టీ ఎంపీ భూ కబ్జాపై కూటమి భాగస్వామ్యులుగా ఉన్న భారతీయ జనతా పార్టీ, జనసేన తమ పార్టీల వైఖరేంటో చెప్పాలి. ఈ దోపిడీని సమర్థిస్తున్నారా? లేదా దీన్ని తప్పని వ్యతిరేకిస్తారా? తమ వైఖరేంటో స్పష్టం చేయాలి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటే విశాఖలో వేలాది కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు దోచుకోవడంలో స్పీడా? మీకు చేతనైతే విశాఖను అభివృద్ధి చేసి చూపించండి. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తరచూ నీతి ప్రవచనాలు చెపుతుంటారు. రూ.5వేల కోట్ల ప్రభుత్వ భూమిని దోచుకోవడం నీతివంతమైన పాలనా? ఇది ధర్మమా? సమాధానం చెప్పాలి. వైయస్సార్సీపీ ఈ భూ దోపిడీని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఐదేళ్ల పాలనలో వైయస్సార్సీపీ ఎప్పుడూ ఈ తరహా కార్యక్రమాలకు పాల్పడలేదని వివరించారు.

ఓ సెంటో, ఓ పది గజాలో పేదల ఆక్రమణలో ఉంటే దాన్ని రెగ్యులరైజ్ చేయడం పరిపాటి. కానీ ఏకంగా ముఖ్యమంత్రి బంధువులు, స్థానిక ఎంపీ అయి ఉండి



ఏకంగా 54 ఎకరాల అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని రెగ్యులరైజ్ చేయమనడం, ప్రభుత్వం దానికి సిగ్గు లేకుండా ఆమోదించడం ధర్మమా? ఇంత భారీ దోపిడీయా? విజ్ఞులైన విశాఖ ప్రజలు, మేధావులు దీనిపై ఆలోచన చేయాలి. ఇప్పటికైనా కళ్లు తెరవకపోతే సీఎం చంద్రబాబు కుటుంబం విశాఖను పూర్తిగా కబ్జా చేయడం ఖాయం. వారికున్న ధనదాహం రాష్ట్రంలో ఎవరికీ లేదు.. ఈ పోరాటంలో అన్ని వర్గాల ప్రజలు, మేధావులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్నాం. అదే విధంగా వామపక్ష పార్టీలతో మా పార్టీ అధ్యక్షుడు మాట్లాడుతున్నారు. వారితో కలిసి పనిచేయడానికి ఎలా భేషజాలు లేవు.

భారతీయ జనతాపార్టీ, జనసేన పార్టీ నాయకులు, జీవీఎంసీ కౌన్సిల్ లో ఉన్న ఆ పార్టీ సభ్యులతో మాట్లాడుతాం. మీరు ఈ భూకబ్జాను సమర్ధిస్తున్నారా? లేదా అని ప్రశ్నిస్తున్నాం. వాళ్లు కూడా ఈ దోపిడీలో భాగస్వామ్యులు కావాలనుకుంటే ప్రజలే వారికి తగిన జవాబు చెబుతారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి.. ఈ రాష్ట్రం మీద, విశాఖపట్నం మీద, ప్రజల మీద అభిమానం, ప్రేమ ఉంటే రెగ్యులరైజ్ ప్రక్రియను నిలిపివేయాలి. అయితే ఇంత పెద్ద భూకబ్జాకు పాల్పడుతున్న అధికార పార్టీ నేతలు ఆ పనిచేస్తారని భావించడం లేదు. వారి తత్వం అలాంటిది. అందుకే మా పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు బొత్స సత్యనారాయణ. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు కుంబా రవిబాబు, వైసీపీ సిటీ అధ్యక్షుడు కే కే రాజు, సమన్వయకర్తలు మొల్లి అప్పారావు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉమ్మడి స్వాతి దాస్, పళ్ళ దుర్గ , కార్పొరేటర్లు అల్లు శంకర్ రావు, దౌలపల్లి ఏడుకొండల రావు, అక్కరమణి రోహిణి, కటారి అనిల్ కుమార్, మొల్లి లక్ష్మి, నక్కిల లక్ష్మి సురేష్, సాది పద్మారెడ్డి, బిపిన్ కుమార్ జైన్, తోట పద్మావతి, గుండాపు నాగేశ్వరరావు, కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్, వావిలపల్లి ప్రసాద్, రేయ్యి వెంకట రమణ, బర్కత్ అలీ, కెవిఎన్ శశికళ, పివి సురేష్, బల్లా లక్ష్మణ్, మహమ్మద్ ఇమ్రాన్, గుడివాడ సాయి అనూష లతీష్, ఉరుకూటి రామచంద్రరావు (చందు), కో ఆప్షన సభ్యులు సేనాపతి అప్పారావు, ఎండి షరాఫీ, వార్డు అధ్యక్షులు కోడిగుడ్ల శ్రీధర్, భూపతిరాజు శ్రీనివాస్ రాజు పాల్గొన్నారు

## రాజకీయాల్లోకి బొత్స కుమార్తె..?

**మొదటి పేజీ తరువాయి...**

ఆయన, బొబ్బిలి ఎంపీగా.. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్‌గా కూడా ఉన్నారు. ఉత్తరాంధ్ర రాజకీయాలను ప్రభావితం చేసిన బొత్స.. ప్రస్తుతం మండలిలో ప్రతిపక్షనేతగా ఉన్నారు. విజయనగరం జిల్లాను శాసించిన ఆయన మొన్నటి ఎన్నికల్లో చేదు అనుభవం ఎదుర్కొన్నారు. అయినప్పటికీ ఇప్పటికీ ఆ జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో బొత్స కుటుంబం ప్రభావితం చేయగలుగుతంది. ఆయన భార్య ఝాన్సీ రెండు సార్లు ఎంపీగా గెలుపొందగా.. సోదరుడు అప్పలనర్సయ్య ఎమ్మెల్యేగా.. తన మేనల్లుడు చిన్న శ్రీను ముఖ్య రాజకీయ నేతగా ఉన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా లేకపోవడం.. మండలి వైపు వెళ్లిపోవడంతో రాజకీయాల్లో తన కుటుంబాన్ని మరింత యాక్టివ్ చేయాలన్న ఉద్దేశ్యంతో ఆయన అనూహ్యంగా తన కుమార్తెను తీసుకొచ్చారు. బొత్స సత్యనారాయణ కుమారుడు సందీప్, కుమార్తె అనూష ఇద్దరూ వైద్యులే. కొంత కాలం తండ్రితో కలిసి రాజకీయాల్లో ఉన్నప్పటికీ సందీప్ అంత చుర్గాగా పాల్గొనలేదు. వైద్య వృత్తి ప్రాక్టీస్ చేస్తున్న ఆయనకు రాజకీయాలపై అంత ఆసక్తి చూపడం లేదని తెలిసింది. ఎంబీబీఎస్ చదివిన అనూష ఈమధ్య తండ్రితో కలిసి రాజకీయ సమావేశాల్లో పాల్గొంటున్నారు. ఇంట్లో జరుగుతున్న ముఖ్య నేతల మీటింగ్‌లకే కాదు.. నియోజకవర్గ కార్యకర్తల సమావేశాలకు కూడా అటెండ్ అవుతున్నారు. మంగళవారం గరివిడిలో జరిగిన వైసీపీ చీపురుపల్లి నియోజకవర్గ సమావేశానికి తండ్రితో కలసి వచ్చారు. బొత్స సత్యనారాయణను రాజ్యసభకు పంపే యోచనలో వైసీపీ నాయకత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అప్పుడు నియోజకవర్గ బాధ్యతలను కుమార్తెకు అప్పగించాలనుకుంటున్నారు. అందుకు ఆమెను ఇప్పటి నుంచే సిద్ధం చేస్తున్నారు. అయితే ఈ మధ్యలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమెను పోటీ చేయిస్తారని కూడా ప్రచారం జరుగుతోంది. చీపురుపల్లి పరిధిలోని ఓ మండలం నుంచి ఆమె జెడ్పీటీసీగా పోటీ చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం జిల్లా అంతటా టీడీపీ ఎమ్మెల్యేలే ఉండటంతో జెడ్పీ పీఠంపై వైసీపీకి ఆశలు లేవు కానీ.. అసెంబ్లీ ఎన్నికల సమయానికి జెడ్పీటీసీ పనిచేసిన అనుభవం పనికొస్తుందని భావిస్తున్నారు.

## విమాన ప్రమాదంలో అజిత్ పవార్ దుర్మరణం

**మొదటి పేజీ తరువాయి...**

విమానం నుంచి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో విమానం రెండు ముక్కలైంది. అందులోని వారంత కాలి బూడిదయ్యారు. బారామతిలో బహిరంగ సభకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్టు సమాచారం. ఘటనాస్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. కూలిపోయి అగ్నికి ఆహుతైన విమానంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తోపాటు, మరో ఇద్దరు సిబ్బంది ఒక పీఎస్ఓ, ఒక సహాయకుడు మరో ఇద్దరు పైలట్, కో-పైలట్ మొత్తం ఐదుగురు ఉన్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, విమానంలో ఉన్న ఏ ఒక్కరూ ఈ ప్రమాదం నుండి ప్రాణాలతో బయటపడలేదని డీజీసీఏ అధికారికంగా ప్రకటించింది. అజిత్ పవార్ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అజిత్ పవార్ వర్గం అధ్యక్షులు. మహారాష్ట్రలో అత్యధిక కాలం ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన నాయకుడు. 2024 డిసెంబరు 5 నుంచి దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రిగా ఉన్న మహాయుతి ప్రభుత్వంలో ఏకనాథ్ షిండేతో కలిసి డిప్యూటీ సీఎంగా పనిచేస్తున్నారు. ప్రమాదం వార్త తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి రక్షణ సిబ్బంది, పోలీసులు, ఫైర్ సర్వీస్ బృందాలు చేరుకున్నాయి. డిప్యూటీ సీఎం విమాన ప్రమాదంలో చనిపోయారన్న వార్త తెలిసి ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, మరో ఉప ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండే, ఇతర నాయకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ప్రభుత్వం, ప్రతిపక్షాలు ఈ దుర్ఘటనపై తీవ్ర ఆవేదన, దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాయి. ప్రజలు పెద్ద ఎత్తున ఘటనాస్థలానికి చేరుకున్నారు. బారామతి నియోజకవర్గం నుంచి బలమైన బేస్ ఉన్న అజిత్ పవార్, శరద్ పవార్ అన్నయ్య కుమారుడు. రాజకీయంగా చాలా శక్తిమంతమైన వ్యక్తిగా ఎదిగారు. ఆయన మరణంతో మహారాష్ట్ర రాజకీయాల్లో భారీ లోటు ఏర్పడిందని పలువురు రాజకీయ ప్రముఖులు చెబుతున్నారు. పవార్ మృతితో మహాయుతి కూటమి, బారామతి ప్రాంతీయ రాజకీయాలపై తీవ్ర ప్రభావం పడనుంది.

## కూటమి నేతల బరితెగింపు

**మొదటి పేజీ తరువాయి...**

పోయింది. విచ్చలవిడితనం ఊహించని స్థాయికి చేరింది అంటూ జగన్ మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు, ఆయనకు మద్దతు ఇస్తున్న ఎమ్మెల్యేలు ఏ స్థాయికి దిగజారారో అర్థం కావడం లేదని విమర్శించారు. రైల్వే కోడూరు ఎమ్మెల్యే ఒక ప్రభుత్వ ఉద్యోగి అయిన మహిళను బెదిరించి, భయపెట్టాడని వైఎస్ జగన్ ఆరోపించారు. అలాగే ఆముదాలవలస ఎమ్మెల్యే వేధింపులు భరించలేక ఒక మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని, సత్యవేడు ఎమ్మెల్యే మహిళపై అత్యాచారం చేసి అధికార బలంతో కేసును క్లోజ్ చేయించుకున్నారని జగన్ పేర్కొన్నారు. మంత్రి సంధ్యారాణి పీఏపై ఫిర్యాదు చేసిన బాధిత మహిళను అరెస్టు చేయడం దారుణమని వ్యాఖ్యానించారు. మరో మంత్రి వాసంశెట్టి సుభాష్ రికార్డింగ్ డ్యాన్సుల వ్యవహారాన్నీ ఆయన ప్రస్తావించారు. ఇక, చంద్రబాబు అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు పూర్తయ్యాయని, మూడు బ్జడెట్లు పెట్టినా ప్రజలకు ఒక్క మంచిపని కూడా జరగలేదని జగన్ విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించి ప్రతి హామిని అమలు చేశామని గుర్తుచేశారు. కోవిడ్ వంటి సంక్షోభంలోనూ ఏ పథకాన్నీ నిలిపి వేయలేదన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలన్నీ రద్దయ్యాయని, సూపర్ సిక్స, సూపర్ సెవెన్ హామిలు అబద్ధాలని తేలిపోయాయని విమర్శించారు. గ్యాస్ సిలిండర్ల నుంచీ మద్యం వరకు ప్రతి రంగంలోనూ వెసాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వైసీపీ హయాంలో ఐదేళ్లలో రూ.3.32 లక్షల కోట్ల అప్పులు మాత్రమే చేశామని, అందులో రూ.2.73 లక్షల కోట్లు నేరుగా ప్రజల ఖాతాల్లోకి వెళ్లాయని జగన్ తెలిపారు. కానీ చంద్రబాబు రెండేళ్లలోనే రూ.3 లక్షల కోట్ల అప్పులు చేశారని, ఆ డబ్బు ఎక్కడికి వెళ్లిందో చెప్పాలని ప్రశ్నించారు. దోచుకో,పంచుకో,తిను' అన్న విధానమే ప్రస్తుతం నడుస్తోందని ఆరోపించారు జగన్.. ఇసుక, మద్యం, ఖనిజాల రంగాల్లో విస్తృత అవినీతి జరుగుతోందని, ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం చంద్రబాబు, ఆయన అనుచరుల జేబుల్లోకి వెళ్తోందన్నారు. బెల్టుషాపులు, మద్యం షాపులు అధికార పార్టీ నేతల ఆధీనంలో ఉన్నాయని విమర్శించారు జగన్.గత ఎనిమిది త్రైమాసికాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు చదువులు మానేస్తున్నారని, వసతి దీవెన నిధులు విడుదల కాలేదన్నారు. గోరుముద్ద పథకంలో నాణ్యత లోపించడంతో హాస్టళ్లలో కల్తీ ఆహారం వల్ల ప్రాణాలు పోతున్న పరిస్థితి నెలకొందన్నారు. ఆరోగ్యశ్రీ పూర్తిగా నిర్వీర్యమైందని, రైతులకు గిట్టుబాటు ధరలు లేవని, యూరియా కూడా అందుబాటులో లేదన్నారు. రాబోయే కాలంలో ప్రజల మధ్యే ఉంటూ 150 నియోజకవర్గాల్లో పాదయాత్ర చేపడతానని జగన్ ప్రకటించారు. గ్రామస్థాయిలో పార్టీ కమిటీలను బలోపేతం చేస్తామని, జగన్ 2.0లో కార్యకర్తలకు పెద్దపీట ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలు ఈసారి చంద్రబాబు ప్రభుత్వాన్ని ఫుట్‌బాల్ తన్నినట్టు తంతారు అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు వైసీపీ అధినేత వైఎస్ జగన్.

## మహారాష్ట్ర విమాన ప్రమాదం పట్ల మోర్త ప్రమోద్ కుమార్ తీవ్ర విచారం

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**



మహారాష్ట్రలో జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచార కార్యక్రమానికి సంబంధించి బారామతి వెళ్తున్న సమయంలో విమానం లాండింగ్ సందర్భంగా జరిగిన ప్రమాద ఘటన పట్ల నిడదవోలు బీజేపీ పట్టణ అధ్యక్షులు మోర్త ప్రమోద్ కుమార్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటన దేశవ్యాప్తంగా ప్రజలను కలచివేసిందని ఆయన అన్నారు. ప్రమాదంలో గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ క్లిష్ట సమయంలో బాధితులు, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం, శాంతి ప్రసాదించాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ప్రమాద ఘటనపై విచారం వ్యక్తం చేస్తూ, ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా విమాన భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని సంబంధిత అధికారులను కోరారు. విమానాల లాండింగ్, టేకాఫ్ సమయంలో భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ ఘటనపై ప్రజలందరి తరపున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు మోర్త ప్రమోద్ కుమార్ తెలిపారు. బాధితులకు అన్ని విధాలా సహాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



## దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

**మొదటి పేజీ తరువాయి...**

ప్రభుత్వ హయాంలో నెయ్యి కల్తీ జరిగిందనేది యదార్థమని అధికారులు తెలిపారు. కాంట్రాక్ట్ తీసుకున్న డెయిరీకి పాల సేకరణ సామర్థ్యం లేదని అధికారులు వెల్లడించారు. ఈ సమావేశంలో కల్తీ నెయ్యికి సంబంధించి మంత్రులు మరికొన్ని విషయాలను సీఎం వద్ద ప్రస్తావించారు. కాంట్రాక్ట్ తీసుకున్న డెయిరీలు కొన్ని రసాయనాలు మిశ్రమం ఉపయోగించి నెయ్యి తయారు చేశారని మంత్రులు వెల్లడించారు. వైసీపీ హయాంలో తప్పు చేసి ఇప్పుడు కూటమి ప్రభుత్వం మీద నెట్టే ప్రయత్నం చేశారని మంత్రులు అన్నారు. సిట్ నివేదిక వచ్చిన తరువాత మాట్లాడుదామని మంత్రులకు సీఎం చంద్రబాబు సూచించారు. వైసీపీ నేరప్రవృత్తి అలానే ఉంటుందని, కోడి కత్తి, బాబాయి గొడ్డలి, గులక రాయి కేసులు ఎలా చేశారో మీరు చూశారు కదా? అని సీఎం అన్నారు.

## నయీం గ్యాంగ్‌పై ఈడీ నజర్

**మొదటి పేజీ తరువాయి...**

సంపాదించిన సుమారు రూ.11.30 కోట్ల విలువైన 91 ఆస్తులను ఈడీ ఇప్పటికే గుర్తించింది. ఈ కేసులో పాశం శ్రీనివాస్ తో సహా మొత్తం 10 మందిపై అభియోగాలు మోపింది. మొత్తం 91 ఆస్తులను 'ప్రొసీడ్స్ ఆఫ్ క్రైమ్'గా ఈడీ గుర్తించింది. ఈ ఆస్తులు బలవంతంగా బాధితులను బెదిరించి రిజిస్టర్ చేయించుకున్నట్లుగా గుర్తించారు. ఈ ఆస్తులన్నీ నయీం తన కుటుంబ సభ్యులు, సన్నిహితుల పేర్లపై బినామీలుగా రిజిస్టర్ చేసినట్లుగా ఈడీ అధికారులు ధ్రువీకరించారు. ఇక కేసులో నయీం భార్య హసీనా బేగంతో పాటు పలువురు కుటుంబ సభ్యుల పేర్లను ఈడీ తన ఛార్జిషీట్‌లో పేర్కొంది. పలుమార్లు నోటీసులు జారీ చేసినా వారు విచారణకు హాజరుకాకపోవడం, ఆదాయపు పన్ను రిటర్న్లు దాఖలు చేయకపోవడంతో ఈడీ కఠిన చర్యలకు సిద్ధమైంది. అవసరమైతే నిందితులపై నాన్-బెయిలబుల్ వారెంట్లు జారీ చేయాలని కూడా కోర్టుకు విన్నవించినట్లుగా తెలుస్తోంది. అలానే ఈ కేసులోని 91 ఆస్తుల జప్తునకు అనుమతివ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఈడీ కోరింది. ఇప్పటికే బినామీ చట్టం కింద ఐటీ శాఖ అటాచ్ చేసింది. నయీంకు సహకరించిన కొందరు రాజకీయ నాయకులు, పోలీసు అధికారుల ఆర్థిక లావాదేవీలపై కూడా ఈడీ ఫోకస్ పెట్టింది. అక్రమంగా సంపాదించిన సొమ్ము ఎక్కడికి వెళ్లిందనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. కోర్టు తాజాగా ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను స్వీకరించిన నేపథ్యంలో నిందితులకు త్వరలోనే నోటీసులు జారీ అయ్యే అవకాశం ఉంది.

## జనసేన ఎమ్మెల్యే కీచక పర్వం

**మొదటి పేజీ తరువాయి...**

రక్షణ లేకుండా పోయిందని, అధికార మదంతో ఎమ్మెల్యేలు మహిళల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ధ్వజమెత్తారు.

### కూటమి ఎమ్మెల్యేల బరితెగింపు

"రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ కీచక పర్వం దేశం మొత్తం చూసింది. ఆయనపై విడుదలైన వీడియోలు జుగుప్సాకరంగా ఉన్నాయి. ఒక మహిళా ఉద్యోగినిని ట్రాప్ చేసి, లోబరుచుకొని అత్యాచారం చేయడం, గర్భవతి అయ్యాక అబార్షన్ చేయించడం, బెదిరింపులు, దాడులు చేయడం చూశాం. ఈ ఘటనలు చూస్తే కూటమి ఎమ్మెల్యేలు ఎంత బరితెగించారో అర్థమవుతోంది. గత 20 నెలలుగా కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు, ఆ పార్టీ కార్యకర్తలు తప్పుడు పనులు చేస్తే చట్టం శిక్షిస్తుందనే భయం లేకుండా మహిళల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు, వేధింపులు జరుగుతున్నా ఒక్కరిపై కూడా గట్టి చర్యలు లేవు. బాధితులపైనే తప్పుడు కేసులు పెడుతున్నారు

### పవన్ కళ్యాణ్..ముందు మీ ఎమ్మెల్యే తాట తీయండి

రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఒక మహిళా ఉద్యోగినిని ట్రాప్ చేసి, పెళ్లి చేసుకుంటానని మోసం చేసి, బెదిరించి, కొట్టి, ఐదుసార్లు అబార్షన్ చేయించాడు. లొంగకపోతే మూడేళ్ల కుమారుణ్ని చంపుతానని బెదిరించాడు. ఆమె ఎంత బాధపడి ఇవాళ వీడియోలతో బయటకు వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. మహిళలపై చెయ్యి వేస్తే తాట తీస్తానని పవన్ కళ్యాణ్ పెద్ద పెద్ద డైలాగులు చెప్పారు. ఇప్పుడు మీ ఎమ్మెల్యే మహిళను ఇంత దారుణంగా వేధించాడు. ముందు మీ ఎమ్మెల్యే తాట తీయండి. సుమోటోగా కేసు నమోదు చేయండి. అరెస్ట్ చేయించండి.

### చంద్రబాబూ.. సినిమా డైలాగ్స్ వద్దు

ఎవరైనా మహిళ జోలికి వస్తే అదే చివరి రోజు అని చంద్రబాబు అంటారు. ఇన్ని ఘటనల్లో ఎవరికది చివరి రోజు అయ్యింది? సినిమా డైలాగులు కాదూ దోషులను శిక్షించాలి. ఇంకొకరికి భయం ఉండాలి. మహిళా హోం మంత్రి అనిత పదవి వైయస్ జగన్‌ను తిట్టడానికేనా? వైయస్ఆర్‌సీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టడానికేనా? మహిళలపై ఇంత దారుణాలు జరుగుతుంటే హోం మంత్రి ఏం చేస్తున్నారు? జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై కేసు పెట్టండి. నడిరోడ్డుపై నడిపించండి.

### బాధిత కుటుంబాలకు వైయస్ఆర్‌సీపీ వెన్నుదన్ను

మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై వైయస్ఆర్‌సీపీ ఎప్పుడూ పోరాడుతోంది. మా అధినేత వైయస్ జగన్ బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. ఈ ఘటనలో బాధిత మహిళకు న్యాయం జరిగే వరకు వైయస్ఆర్‌సీపీ వెన్నుదన్నుగా ఉంటుంది. అరవ శ్రీధర్‌పై సుమోటోగా కేసు నమోదు చేయాలి. జనసేన నుంచి సస్పెండ్ చేయాలి. ఎమ్మెల్యేగా డిస్క్వాలిఫై చేయాలి. మహిళా కమిషన్ సుమోటోగా చర్యలు తీసుకోవాలి అని ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి డిమాండ్ చేశారు.

# జీడీ పంటకు మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వమే కోనుగోలు చేయాలి



మాడుగుల జనవరి 28, జయ జయహే

జీడీ పిక్కలకు కేజీ రెండు వందలు రూపాయలు మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వ మే రైతు భరోసా కేంద్రాలు ద్వారా కోనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న మండల కార్యదర్శి ఇ నరసింహమూర్తి, కె భవానీ డిమాండ్ చేసారు. బుధవారం శంకరం పంచాయతీ లో విస్రుతంగా పర్యాటించి గిరిజన జీడీ రైతులు సమస్యలు అడిగి తెలుసుకుని జీడీ తోటలను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు. ప్రతి సంవత్సరం,జీడి పంటకు గిట్టు బాటు ధర లేక గిరిజన రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని తెలిపారు. ప్రభుత్వం వరి,చెరకు,పత్తి మొదలగు పంటలకు మద్దతు ధర ప్రకటిస్తుందని.కాని జీడి పంటకు మాత్రం ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడం లేదన్నారు మార్కెట్ సౌకర్యం కల్పించక పోవడం ధర కూడా నిల కడగా ఉండక పోవడం జీడి పిక్కల పంట సమయంలో వ్యాపారులు ధర తగ్గించి రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారని తెలిపారు వ్యాపారుల చేతికి జీడిపిక్కలు చేరిన తరువాత ఆమాంతంగా జీడి ధర పెరుగు పోతుందని తెలిపారు.రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రాక నష్ట పోతున్నారని అవేదన వ్యక్తం చేసారు.జీడి పిక్కల ధర ప్రభుత్వం శాస్త్రీయంగా నిర్ణయించి అమలు చేయక పోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.జీడి రైతులను మోసగి స్తున్నారని తెలిపారు .



## కయాకింగ్ పోటీలను ప్రారంభించిన గంటా

రుషికొండ, జనవరి 28: (జయ జయహే)



విశాఖ ఉత్సవ్ లో భాగంగా రుషికొండ బీచ్ లో కయాకింగ్ పోటీలను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. మొత్తం 50 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. సింగిల్ కయాకింగ్ లో 25 మంది.. డబుల్ కయాకింగ్ లో మరో 25 మంది పోటీ పడుతున్నారు. విజేతలకు రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున ప్రైజ్ మనీ అందజేయనున్నారు. పోటీల్లో పాల్గొన్న వారిని అధికారులు గంటాకు పరిచయం చేశారు. దేశంలో జరుగుతున్న అతిపెద్ద బీచ్ ఫెస్టివల్ విశాఖ ఉత్సవ్ ను విజయవంతం చేయాలని పిలునిచ్చారు. 9 రోజుల పాటు నిర్వహిస్తున్న ఉత్సవ్ లో భాగం కావడానికి ఇతర ప్రాంతాల నుంచి కూడా పర్యాటకులు వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి మాధవి, జిల్లా క్రీడల అధికారి జూన్ గాలియట్, కార్పొరేటర్ లొడగల అప్పారావు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.



## సీరంరెడ్డి దేముడుకు నివాళులర్పించిన చొక్కాకుల

సబ్బవరం (జయ జయహే)

సబ్బవరం మండలం, రావులమ్మపాలెం గ్రామానికి చెందిన సీరంరెడ్డి అప్పారావు, సీరంరెడ్డి రమణ, సీరంరెడ్డి రామకృష్ణ ల తండ్రి కీ!!శే!! సీరంరెడ్డి దేముడు దశదిన కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు చొక్కాకుల వెంకటరావు, అంతకాపల్లి ఎంపీటీసీ చొక్కాకుల గోవింద, సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, సబ్బవరం మండలం టిడిపి పార్టీ మాజీ అధ్యక్షులు మిడతాన మహాలక్ష్మినాయుడు, మాజీ సర్పంచ్ రొంగలి దేముడుబాబు లు పాల్గొని ఘన నివాళులర్పించి వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలిగించాలని భగవంతుని కోరారు. ఈ కార్యక్రమంలో జక్కాన సూర్యనారాయణ, బయలపూడి దేముడు బాబు, గొంప పెదరమణ, సబ్బవరపు దాసు, గొంప నర్సింగరావు, రెడ్డి రామునాయుడు, కొటాన కృష్ణ, సబ్బవరపు దేముడు, జక్కాన సన్యాసిరావు, సబ్బవరపు నరసింహులు, గొంప అప్పలనాయుడు, గొంప దేముడు, గొంప ముత్యాలనాయుడు (హైటెక్) పల్లా రమణ, కామిరెడ్డి రమణమ్మ, రాజాన నాయుడు, మండల చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం నిరంకుశ చట్టాలను రద్దు చేయాలి

### సామాజిక న్యాయానికి తూట్లు

### సిపిఎం ఉద్యమాలకు కార్యాచరణలు

టెక్కలి జనవరి 28 జయ జయహే

కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన నిరంకుశ చట్టాలను తక్షణమే రద్దు చేయాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తుందని సిపిఎం శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు , జిల్లా కమిటీ ప్రతినిధి నంబూరు షణ్ముఖరావు పిలుపునిచ్చారు.

మోడీ ప్రభుత్వం వి బి జి రామ్ జి , విద్యుత్ చట్టాల సవరణ లేబర్ కోడ్స్, సీడ్ బిల్లు, మినీ అను విద్యుత్ కేంద్రాలు, అమలు చేయడం వల్ల కార్పొరేట్ కంపెనీలు లాభాలు సాధిస్తాయని, ప్రజలపై విపరీత భారం




పడుతుందని ఆయన అన్నారు. ఈ మేరకు జనవరి 30న గ్రామాల్లో ప్రతిజ్ఞలు, సంతకాల సేకరణ, ఫిబ్రవరి 2న సచివాలయాలకు వినతి పత్రాలు అందించడం, ఫిబ్రవరి 5న మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించడం జరుగుతుందని ఉద్యమాలకు కార్యాచరణ లు చేస్తున్నట్లు తెలిపారు.

కొత్త చట్టాలు అమల్లోకి వస్తే ప్రజలు, ప్రజా సామాజిక న్యాయాలు పూర్తిగా దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేశారు, పేదల కందే సబ్సిడీలు ఉండవని, కార్మికులు సమ్మె హక్కును కోల్పోయి, హక్కులని నిర్వీర్యమైపోతాయని అన్నారు. వ్యవసాయం నష్టాల్లో పడుతుందని, బిజెపి ప్రభుత్వం అమల్లోకి తెస్తున్న చట్టాలన్నిటిని సిపిఎం వ్యతిరేకించి ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా సమ్మెకు సిద్ధమవుతున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కె ఎల్లయ్య, యు లక్ష్మణరావు, ఈశ్వర రావు, బ గాది వాసుదేవరావు, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

# కోస్టల్ సైకిల్ యాత్రను విజయవంతం చేయండి...!

### సిఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ వికాస్ కుమార్ సాహు

భీమిలి (జయ జయహే)

దేశంలో ఉండే తీరప్రాంత మత్స్యకారులలో దేశ రక్షణలో భాగంగా అవగాహన కల్పించడం కోసం సిఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేసే వందేమాతరం కోస్టల్ సైకిల్ యాత్రను దిగ్విజయం చేయాలని డిప్యూటీ కమాండెంట్ వికాస్ కుమార్ సాహు కోరారు.భీమిలి జోన్ 3వ డివిజన్ మత్స్యకారుల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి వందేమాతరం సైకిల్ యాత్ర యొక్క వివరాలను కమాండెంట్ వికాస్ కుమార్ సాహు వివరించారు. ఫిబ్రవరి 6వ తేదీ మధ్యాహ్నం 3గం. ల ప్రాంతంకి భీమిలి తీరంకి ఈ యాత్ర చేరుకుంటుందని అన్నారు. మత్స్యకారులు తీరప్రాంత రక్షణలో ఏవిధంగా ఉండాలనే విషయంపై అవగాహన కల్పించడం కోసం దేశమంతా సైకిల్ యాత్ర చేస్తున్నామని దీనికి మీయొక్క సహకారం కావాలని కోరారు. మత్స్యకారుల నాయకుడు



గంటా నూకరాజు మాట్లాడుతూ సముద్రంలో వేటసమయంలో గాని, తీరంలో గాని మత్స్యకారుడు తుపాకి చేతిపట్టని సైనికుడిలా ఉంటాడని అన్నారు. కొత్తవ్యక్తులు వచ్చినా, సముద్రంలో ఏ ఇతర సందేహంతో కూడిన బోటు కనిపించినా ముందుగా స్పందించింది మత్స్యకారుడేనని అన్నారు. దేశ రక్షణ కోసం మీరు చేస్తున్న ఈ యాత్రకు మా సహకారం ఉంటుందని అన్నారు. మరొక మత్స్యకారుల నాయకుడు మైలపల్లి షణ్ముఖరావు మాట్లాడుతూ తీరప్రాంత మత్స్యకారులను దేశ రక్షణ కోసం సంఘటితం చేయడం కోసం మీరు చేస్తున్న సైకిల్ యాత్ర శుప్రధమని అన్నారు. ఇలాంటి కార్యక్రమం విజయవంతంలో మా మత్స్యకారులు ఎల్లప్పుడూ ముందువరుసలో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐఎస్ఎఫ్ కమాండెంట్ ఏ.కె.మహాపాత్రు, ఇన్స్పెక్టర్స్ ఎస్.సి.ఘోష్, హెచ్.ఎల్. మీనా, ఎల్.వి. రామకృష్ణ, ఇతర మహిళా అధికారులతో పాటు మత్స్యకారుల నాయకులు వాడమొదలు సత్యారావు, కాసరపు నాగరాజు, మట్టా దాసు, తెడ్డు రామదాసు, తెడ్డు సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.



# కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువు

### జనసేన ఎమ్మెల్యే 'కీచక పర్వమే' ప్రత్యక్ష సాక్ష్యం:

### మేడపాటి షర్మిళ రెడ్డి తీవ్ర విమర్శలు

రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:

చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదనడానికి జనసేన పార్టీ ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వ్యవహారమే ప్రత్యక్ష నిదర్శనమని మాజీ ఏపీ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్పర్సన్, మాజీ రుడా చైర్పర్సన్ మేడపాటి షర్మిళ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులే మహిళలపై వేధింపులకు పాల్పడితే రాష్ట్రాన్ని ఎవరు కాపాడాలని ఆమె ప్రశ్నించారు.ఏడాదిన్నరగా మహిళా ఉద్యోగినిని వేధించడం మానవత్వానికి మచ్చ అని, భర్తకు విడాకులు ఇవ్వాలంటూ బెదిరించడం చట్టవిరుద్ధమని ఆమె పేర్కొన్నారు. మూడేళ్ల చిన్నారి ప్రాణాన్ని బెదిరింపుగా ఉపయోగించడం అత్యంత దారుణమైన చర్యగా అభివర్ణించారు.వాట్సాప్ చాట్లు, వీడియో కాల్స్ వంటి ఆధారాలు ఉన్నా ప్రభుత్వం మౌనం వహించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యే అయితే చట్టం పనిచేయదా? అని ప్రశ్నిస్తూ, ఎమ్మెల్యేను వెంటనే అరెస్ట్ చేసి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని ఆమె స్పష్టం చేశారు.



# స్వాతంత్ర సమరయోధుల విగ్రహాల వద్ద మద్యం బాటిళ్లు


### కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా మాజీ ఎంపీ భరత్ బైఠాయింపు

రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:

రాజమండ్రి సిటీ, కంబాల చెరువు దండి మార్చ్ స్వాతంత్ర సమరయోధుల విగ్రహాల వద్ద మద్యం బాటిళ్లు పెట్టిన ఘటనపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ తీవ్రంగా స్పందించారు. గణతంత్ర దినోత్సవం మరుసటి రోజునే ఈ దారుణం చోటుచేసుకోవడం దేశ గౌరవానికి అవమానమని ఆయన మండిపడ్డారు. ఘటన తెలిసిన వెంటనే అక్కడికి చేరుకున్న భరత్, గంటన్నర గడిచినా పోలీస్ యంత్రాంగం స్పందించకపోవడం బాధాకరమన్నారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌తో పాటు ప్రజాప్రతినిధులు సమీపంలో ఉన్నా చర్యలు లేకపోవడం కూటమి ప్రభుత్వ నిర్వాకానికి నిదర్శనమని విమర్శించారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు చోడవరం వాసవి ఆలయ 49వ ఆలయ వార్షికోత్సవ వేడుకలు

చోడవరం జనవరి 28, జయ జయహే



చోడవరం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ 49వ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 29వ తేదీన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ కల గర్ల శేషగిరిరావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి 49 కేజీల లాడు, సారి ఊరేగింపు జరుగుతుందన్నారు. కాబట్టి భక్తులు చీర పసుపు కుంకుమలు సమర్పించాలన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు సరే ఊరేగింపు జరుగుతుందని చెప్పారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు వింధ్య వాసవి సమేత శ్రీ నగరేశ్వర స్వామి వారి కి ఉప్పల శంకర్రావు దంపతులచే కళ్యాణ మహోత్సవం , శ్రీ కోనకమల జనార్ధన స్వామి వారికి కలగర్ల శేషగిరిరావు దంపతులు, వజ్రపు బలరాం దంపతులచే కళ్యాణ మహోత్సవం జరుగునన్నారు.




## బంగ్లాదేశ్‌లో పెచ్చు పెరుగుతున్న ఆకృత్యాలు

(సి.హెచ్.ప్రతాప్)

బంగ్లాదేశ్‌లోని నరసింగి ప్రాంతంలో చంచల్ భౌమిక్ అనే హిందూ యువకుడిని అత్యంత పాశవికంగా సజీవ దహనం చేసిన వైనం సభ్య సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ఈ వార్త విన్న ప్రతి ఒక్కరి గుండె తరుక్కుపోతోంది. ఆ యువకుడు తన గ్యారేజీలో గాఢనిద్రలో ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పు పెట్టడం అనేది అమానుషత్వానికి పరాకాష్ట. ఇది కేవలం ఒక వ్యక్తిపై జరిగిన దాడి కాదు, ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని సాగిస్తున్న మారణహోమం. పొరుగు దేశంలో మైనారిటీల పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోందనడానికి ఈ ఘటనే సజీవ సాక్ష్యం. నిరపరాధి అయిన ఒక యువకుడు ఈ విధంగా బలైపోవడం మానవత్వానికే తీరని కళంకం. బంగ్లాదేశ్‌లో ప్రస్తుత రాజకీయ అనిశ్చితి మధ్య హిందూ సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లు అత్యంత ఆందోళనకరంగా ఉన్నాయి. ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట ఇలాంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకోవడం అక్కడి శాంతిభద్రతల వైఫల్యాన్ని ఎత్తి చూపుతోంది. మనుషుల ప్రాణాలకు కనీస విలువ లేని చోట నాగరికత మనుగడ సాగించడం అసాధ్యం.

అక్కడ తాత్కాలిక ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హిందువులపై దాడుల తీవ్రత ఊహించని విధంగా పెరిగింది. ఈ మధ్య కాలంలోనే దీపు చంద్ర దాస్ అలాగే సమీర్ దాస్ వంటి వారు కూడా హింసకు బలికావడం చూస్తుంటే ఇది యాదృచ్ఛికంగా జరుగుతున్న నేరాలని భావించలేము. ఇదంతా ఒక ప్రణాళిక ప్రకారం మైనారిటీలను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నంలా కనిపిస్తోంది. హిందూ కుటుంబాలు తమ ఇళ్లను వదిలి పారిపోయేలా చేయడమే ఈ దాడుల వెనుక ఉన్న అసలు ఉద్దేశమని అర్థమవుతోంది. పోలీసు స్టేషన్లకు లేదా భద్రతా దళాల కార్యాలయాలకు అత్యంత సమీపంలోనే ఇలాంటి ఘోరాలు జరుగుతున్నాయంటే అధికారుల అలసత్వం లేదా పరోక్ష సహకారం ఉందన్న అనుమానాలు బలపడుతున్నాయి. నిందితులను పట్టుకోవడంలో అలాగే వారికి శిక్షలు పడటంలో జరుగుతున్న ఆలస్యం నేరస్తుల్లో భయాన్ని పోగొడుతోంది. చట్టం తన పని తాను చేయలేకపోతే అరాచక శక్తులు రెచ్చిపోతాయని అనడంలో ఎటువంటి సందేహం లేదు. మైనారిటీల ప్రాణాలను ఆస్తులను కాపాడాల్సిన బాధ్యతను అక్కడి ప్రభుత్వం విస్మరించడం తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనగా పరిగణించాలి.

భారత ప్రభుత్వం ఈ క్లిష్ట సమయంలో మౌనంగా ఉండటం తగదు. పొరుగు దేశంలో జరుగుతున్న ఈ దారుణాలను అరికట్టడానికి అత్యంత కఠినమైన దౌత్యపరమైన చర్యలు తీసుకోవాలి. బంగ్లాదేశ్ ప్రభుత్వంతో జరిపే ప్రతి చర్చలోనూ హిందువుల భద్రతను ప్రధాన అంశంగా ఉంచాలి. మైనారిటీల రక్షణ విషయంలో ఏ మాత్రం రాజీ పడే ప్రసక్తే లేదని ఢాకా పాలకులకు స్పష్టమైన సందేశం పంపాలి. దౌత్యపరమైన సంబంధాలు కేవలం వాణిజ్యానికి పరిమితం కాకుండా మానవ హక్కుల పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలి. భారత విదేశాంగ శాఖ ఈ అంశాన్ని అంతర్జాతీయ వేదికలపై బలంగా వినిపించాలి. ఐక్యరాజ్యసమితి అలాగే వివిధ అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థల ద్వారా బంగ్లాదేశ్‌పై ఒత్తిడి తీసుకురావాలి. అక్కడ జరుగుతున్న అకృత్యాలను పరిశీలించడానికి స్వతంత్ర పర్యవేక్షక బృందాలను పంపేలా ప్రపంచ దేశాలను ఒప్పించాలి. క్షేత్రస్థాయిలో వాస్తవాలను వెలికితీసినప్పుడే బాధితులకు అంతర్జాతీయంగా అండ లభిస్తుంది.

భారతదేశం తన ఆర్థిక అలాగే వ్యూహాత్మక శక్తిని ఉపయోగించి మైనారిటీల ప్రయోజనాలను కాపాడాలి. బంగ్లాదేశ్‌తో కొనసాగిస్తున్న వాణిజ్య ఒప్పందాలు అలాగే అభివృద్ధి కార్యక్రమాలను మైనారిటీల భద్రతకు ముడిపెట్టాలి. మైనారిటీ నివాస ప్రాంతాల్లో అలాగే దేవాలయాల వద్ద పటిష్టమైన భద్రత కల్పించేలా కచ్చితమైన ప్రోటోకాల్స్ అమలు జరిగేలా చూడాలి. ఈ నిబంధనలు అమలు కాకపోతే ద్వైపాక్షిక సహకారంపై పునరాలోచన చేస్తామన్న సంకేతాలను ఇవ్వాలి. కేవలం ఖండన ప్రకటనలతో ఆగకుండా ఆచరణాత్మకమైన ఆంక్షల దిశగా ఆలోచించాలి. చంచల్ భౌమిక్ లాంటి యువకులు అన్యాయంగా ప్రాణాలు కోల్పోవడం ఆ సమాజం మొత్తానికి తీరని లోటు. నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించే వరకు భారత ప్రభుత్వం విశ్రమించకూడదు. బాధితుల కుటుంబాలకు న్యాయం జరగాలి. హిందూ సమాజంలో నెలకొన్న భయాందోళనలను తొలగించడానికి అవసరమైన అన్ని మార్గాలను అన్వేషించాలి.

మానవత్వం అనేది సరిహద్దులకు పరిమితం కాకూడదు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ హింస జరిగినా అది మానవాళికే ముప్పు. మతం పేరుతో సాగుతున్న ఈ రాక్షసత్వాన్ని అడ్డుకోవడానికి భారత్ నాయకత్వ బాధ్యత తీసుకోవాలి. పొరుగు దేశాల్లోని హిందువుల హక్కులను కాపాడటం మన నైతిక బాధ్యత. సామాజిక మాధ్యమాలు అలాగే ఇతర ప్రచార సాధనాల ద్వారా ఈ అరాచకాలను ప్రపంచం దృష్టికి తీసుకెళ్లాలి. హిందూ దేవాలయాల ధ్వంసం అలాగే ఆస్తుల లూటీని ఆపడానికి పటిష్టమైన చర్యలు చేపట్టాలి. బంగ్లాదేశ్‌లోని శాంతిని కోరుకునే శక్తులను ఏకం చేసి మైనారిటీలకు భరోసా కల్పించాలి. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం కూడా బాధితుల్లో ధైర్యాన్ని నింపేలా ఉండాలి. అనాథలైన కుటుంబాలకు బాసటగా నిలవాలి. భవిష్యత్తులో ఇలాంటి దారుణ ఘోరాలు మళ్లీ సంభవించకుండా ఉండాలంటే అంతర్జాతీయ చట్టాలను కఠినంగా అమలు చేయాలి.



# హైస్పీడ్ రైళ్ల వెనుక దాగిన ప్రమాదం: స్పెయిన్ అనుభవం

(సి.హెచ్.ప్రతాప్)



**2026 జనవరి మాసంలో స్పెయిన్ రైల్వే వ్యవస్థ వరుస ప్రమాదాలతో అట్టుడికిపోయింది. ప్రపంచవ్యాప్తంగా హైస్పీడ్ రైళ్ల భద్రతపై ఉన్న అచంచలమైన నమ్మకాన్ని ఈ ఘటనలు ఒక్కసారిగా ప్రశ్నించేలా చేశాయి. భారతదేశం వంటి దేశాలు ప్రస్తుతం ప్రతిష్టాత్మకమైన హైస్పీడ్ రైలు ప్రాజెక్టులను వేగంగా చేపడుతున్న తరుణంలో స్పెయిన్ అనుభవం రవాణా రంగ నిపుణులకు మరియు ప్రభుత్వాలకు అత్యంత కీలకమైన పాఠాలను అందిస్తోంది. సాంకేతికత ఎంత ఆధునికమైనప్పటికీ నిరంతర పర్యవేక్షణ లోపిస్తే అది ఎంతటి వినాశనానికి దారితీస్తుందో ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. జనవరి 18న స్పెయిన్‌లోని కార్డోబా ప్రావిన్స్ పరిధిలో ఉన్న అదముజ్ వద్ద చోటుచేసుకున్న ఘోర ప్రమాదం అంతర్జాతీయ సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఒక ఇరియో హైస్పీడ్ రైలు అకస్మాత్తుగా పట్టాలు తప్పి పక్కనే ఉన్న ట్రాక్‌పైకి దూసుకెళ్లడంతో ఎదురుగా వస్తున్న రెన్ఫే రైలును అతివేగంతో ఢీకొంది. ఈ భీకర సంఘటనలో 45 మంది ప్రాణాలు కోల్పోగా సుమారు 292 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇది గడిచిన దశాబ్ద కాలంలో స్పెయిన్ రైల్వే చరిత్రలోనే అత్యంత విషాదకరమైన ప్రమాదంగా నమోదైంది.**

ప్రాథమిక దర్యాప్తు నివేదికల ప్రకారం ప్రమాదం జరిగిన పట్టాపై ముందు నుంచే ఉన్న ఒక సాంకేతిక పగులును గుర్తించకపోవడమే ఈ ఘోరానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆధునిక రైల్వే




భద్రతా వ్యవస్థల్లోని సాంకేతిక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా యూరోపియన్ రైలు నియంత్రణ వ్యవస్థ వంటి అధునాతన సాంకేతికతలు రైలు వేగాన్ని మరియు దూరాన్ని నిరంతరం పర్యవేక్షిస్తాయి. ఒకవేళ డ్రైవర్ సిగ్నల్‌ను గమనించకపోయినా లేదా నిర్ణీత వేగం కంటే ఎక్కువ వేగంతో వెళ్తున్నా ఈ వ్యవస్థ స్వయంచాలకంగా బ్రేకులను ప్రయోగిస్తుంది. భారతదేశం కూడా స్వదేశీ పరిజ్ఞానంతో కవచ్ అనే భద్రతా వ్యవస్థను అభివృద్ధి చేస్తోంది. ఇది రెండు రైళ్లు ఒకే పట్టాలపై ఎదురెదురుగా వచ్చినప్పుడు ప్రమాదాలను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

కేవలం సిగ్నలింగ్ మాత్రమే కాకుండా పట్టాల పటిష్టతను పరీక్షించేందుకు ఇప్పుడు కృత్రిమ మేధస్సు ఆధారిత సెన్సార్లను వాడుతున్నారు. ఈ సెన్సార్లు పట్టాలలో వచ్చే అతి సూక్ష్మమైన పగుళ్లను కూడా గుర్తించి కంట్రోల్ రూమ్‌కు సమాచారాన్ని అందిస్తాయి. దీనివల్ల ప్రమాదం జరగక ముందే తగిన జాగ్రత్తలు తీసుకునే వీలుంటుంది. అలాగే రైలు ఇంజిన్లలో అమర్చే వీడియో అనలిటిక్స్ కెమెరాలు పట్టాలపై ఉన్న అడ్డంకులను కిలోమీటరు దూరం నుండే గుర్తించగలవు. స్పెయిన్ వరుస వైఫల్యాలు ఇలాంటి సాంకేతికతలను కేవలం ఏర్పాటు చేయడమే కాకుండా వాటిని నిరంతరం అప్‌డేట్ చేయడంలో ఉన్న ప్రాముఖ్యతను చాటిచెప్పాయి. కాటలోనియాలో కురిసిన భారీ వర్షాలకు రైల్వే రక్షణ గోడ కూలిపోయి జరిగిన ప్రమాదం మౌలిక సదుపాయాల రూపకల్పనలో భౌగోళిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని సూచిస్తోంది.

భారతదేశం తన హైస్పీడ్ రైలు స్వప్నాన్ని సాకారం చేసుకునే క్రమంలో ఈ అంతర్జాతీయ పరిణామాలను నిశితంగా పరిశీలించాలి. కేవలం వేగం మరియు ఆధునికతపై మాత్రమే దృష్టి పెట్టకుండా అత్యున్నత భద్రతా ప్రమాణాలను ఒక పటిష్టమైన విధానంగా అమలు చేయాలి. ట్రాక్ రూపకల్పన నుండి సిగ్నలింగ్ వ్యవస్థల వరకు మరియు డ్రైవర్ల వృత్తిపరమైన శిక్షణ వరకు ప్రతి దశలోనూ సమగ్రమైన భద్రతా ఆడిట్ నిర్వహించాలి. అలాగే ప్రాజెక్టుల పురోగతి గురించి ప్రజలకు పారదర్శకమైన సమాచారాన్ని అందించడం ద్వారా వ్యవస్థపై విశ్వసనీయతను పెంచాలి. సాంకేతికత ఎంత పురోగమించినా అది మానవ మేధస్సుకు తోడుగా మాత్రమే పనిచేస్తుంది కాబట్టి క్షేత్రస్థాయిలో పని చేసే సిబ్బందికి అత్యాధునిక పరికరాలపై సరైన అవగాహన కల్పించాలి.

స్పెయిన్ అనుభవం మనకు ఇచ్చే సందేశం ఏమిటంటే కేవలం వేగం మాత్రమే వికాసానికి కొలమానం కాదు. బాధ్యతాయుతమైన నిర్వహణ మరియు కచ్చితమైన భద్రతా ప్రమాణాలు లేని పక్షంలో అత్యంత వేగవంతమైన ప్రయాణాలు పెను విషాదాలుగా మారే ప్రమాదం ఉంది. భారతదేశం తన భవిష్యత్ రైలు ప్రాజెక్టులలో ఈ పాఠాలను గట్టిగా అమలు చేస్తూ ప్రయాణికుల భద్రతకు అగ్రపీఠం వేయాలి. అప్పుడే మన ప్రయాణాలు సురక్షితంగా మరియు సుఖమయంగా సాగుతాయి

# రైతు సంక్షేమానికి 'డిజిటల్' బాట: 'ఫార్మర్ రిజిస్ట్రీ'తోనే సాగుకు భరోసా!




దేశానికి వెన్నెముకైన రైతుకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా, పారదర్శకంగా అందాలన్నదే కేంద్రఉ రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన లక్ష్యం. ఈ లక్ష్యాన్ని కార్యరూపం దాల్చేలా రూపొందించిన కీలక సంస్కరణే 'యూనిక్ ఫార్మర్ ఐడీ ఉ ఫార్మర్ రిజిస్ట్రీ'. మధ్యవర్తుల మోసాలు, నకిలీ లబ్ధిదారుల దందా, డూప్లికేట్ రికార్డులకు చెక్ పెట్టేలా ఈ డిజిటల్ వ్యవస్థ రూపుదిద్దుకుంది.

ఆధార్ తరహాలోనే 'ఫార్మర్ ఐడీ' కీలకం

సాధారణ పౌరుడికి 'ఆధార్' ఎంత అవసరమో, ఇకపై రైతుకు 'ఫార్మర్ ఐడీ' అంతే కీలకం. ఇది కేవలం ఒక సంఖ్య కాదు రైతు హక్కులకు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు, సాగు భవిష్యత్తుకు ఇచ్చే డిజిటల్ భరోసా.

ఒకే రికార్డు ఉ రైతు పూర్తి ప్రొఫైల్

ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారా రైతుకు సంబంధించిన పూర్తి సమాచారం ఒకే చోట నిక్షిప్తమవుతుంది:

భూమి వివరాలు : సాగు విస్తీర్ణం మరియు భూమి రికార్డులు.

పంటల స్వభావం : ఏ కాలంలో ఏ పంటలు వేస్తున్నారనే సమాచారం.

ఆర్థిక వివరాలు : బ్యాంక్ ఖాతా మరియు ఇప్పటివరకు పొందిన పథకాల లబ్ధి.

అధికారిక గుర్తింపు: దీని ద్వారా రైతు ప్రభుత్వ రికార్డుల్లో శాశ్వత లబ్ధిదారుడిగా గుర్తింపు పొందుతాడు.

**తెలంగాణలో పరిస్థితి:**

తెలంగాణలో సుమారు 65ఉ70 లక్షల మంది రైతులు ఉండగా, ప్రస్తుతం కేవలం 45 శాతం మంది మాత్రమే రిజిస్ట్రీ ప్రక్రియలో ఉన్నారు. అవగాహన లోపం వల్ల దాదాపు 30 లక్షల మంది రైతులు ఇంకా ఈ డిజిటల్ గుర్తింపుకు దూరంగా ఉన్నారు. ఇది భవిష్యత్తులో వారికి అందాల్సిన ప్రభుత్వ సాయానికి ఆటంకంగా మారే ప్రమాదం ఉంది.

నిర్లక్ష్యం వద్దు : ఫార్మర్ ఐడీ లేకపోతే పీఎం కిసాన్ నిధులు, పంట బీమా క్లెయిమ్స్, మద్దతు ధరకు పంట విక్రయం , ఎరువులు మరియు విత్తనాల సబ్సిడీ వంటివి నిలిచిపోయే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

నమోదు ప్రక్రియ ఉ సులభం మరియు ఉచితం

రైతులు ఎటువంటి ఇబ్బంది పడకుండా ఈ ప్రక్రియను సరళతరం చేశారు. కింది పత్రాలతో సంప్రదించాలి:

ఆధార్ కార్డు (మొబైల్ నంబర్ లింక్ అయి ఉండాలి).

పట్టాదారు పాస్‌పుస్తకం.

బ్యాంక్ ఖాతా వివరాలు.

ఎక్కడ సంప్రదించాలి?: సమీపంలోని రైతు వేదికలు, మండల వ్యవసాయ అధికారి లేదా వ్యవసాయ విస్తరణ అధికారి లను కలిసి వ-ఖ్జ పూర్తి చేయవచ్చు. త్వరలోనే మీ-సేవా కేంద్రాల ద్వారా కూడా ఈ సేవ అందుబాటులోకి రానుంది.

**ప్రయోజనాలు అనేకం:**

నేరుగా నగదు బదిలీ : పెట్టుబడి సాయం ఎటువంటి జాప్యం లేకుండా నేరుగా ఖాతాలో పడుతుంది.

పారదర్శకత: నకిలీ లబ్ధిదారుల ఏరివేత, నిజమైన రైతుకే ప్రాధాన్యత.

ప్రణాళికాబద్ధ వ్యవసాయం : విత్తనాలు, ఎరువుల పంపిణీలో ప్రభుత్వానికి స్పష్టత వస్తుంది.

సాంకేతికతను అందిపుచ్చుకున్న రైతే ఆధునిక వ్యవసాయంలో విజేత అవుతాడు ,అందుకే, అన్నదాతలు ఆలస్యం చేయకుండా వెంటనే అంకెల ఐడీని పొంది తమ సాగుకు భద్రత కల్పించుకోవాలి...

జి. అజయ్ కుమార్
వ్యవసాయ
నిపుణులు



## గోదావరిలో యథేచ్ఛ తవ్వకాలు,
# ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం





**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

రాజమహేంద్రవరం పరిసరాల్లో గోదావరి నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు ఆగడం లేదు. ఓపెన్ రీచ్‌లకు మాత్రమే పరిమితమవ్వాల్సిన తవ్వకాలు, నదీ తీరాన్ని ఆనుకుని ఉన్న దాదాపు అన్ని ర్యాంపులకూ విస్తరించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. కలెక్టర్ శిక్షణ కోసం వెళ్ళడంతో ఇదే అదునుగా ఇసుక మాఫియా మరింత రెచ్చిపోతోంది. రాత్రి పగలు తేడా లేకుండా బోట్లు, లారీలు నదిలోకి దిగి ఇసుకను తోడేస్తున్నాయి. బిల్లులు లేకుండానే రవాణా జరుగుతుండటంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం గండి పడుతోంది. ఒక్క బిల్లుపై రూ.350 ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉండగా, జిల్లాలో రోజు రూ.10 లక్షలకుపైగా నష్టం జరుగుతోందన్న అంచనాలు ఉన్నాయి. గతంలో సీసీ కెమెరాలు, వే-బ్రిడ్జిలు, రెవెన్యూ-పోలీసు పర్యవేక్షణ ఉండగా, ప్రస్తుతం అవన్నీ నిర్వీర్యమయ్యాయి. అధికార యంత్రాంగం తక్షణమే స్పందించకపోతే గోదావరి నది తీరమే ప్రమాదంలో పడే పరిస్థితి కనిపిస్తోంది.




## ఇసుక ర్యాంపు వివాదంలో యాదవ యువకుడిపై మారణాయుధాలతో దాడి యత్నం

**ప్రాణ బిక్ష కోరుతూ పోలీసులకు ఫిర్యాదు**

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం ప్రక్కిలంక బ్లాక్‌ఉ1 ఇసుక ర్యాంపు బాధ్యతలు నిర్వహిస్తున్న బర్ల బాబురావు (యాదవ సామాజిక వర్గం)పై అగ్రకులాలకు చెందిన ఇసుక ర్యాంపు నిర్వాహకులు మారణాయుధాలతో హత్యాయత్నం చేసిన ఘటన సంచలనం రేపింది. 25-01-2026 ఉదయం తనకు సంబంధించిన లారీలు ప్రభుత్వ బాటలో వెళ్లకుండా అడ్డంకులు పెట్టడాన్ని ప్రశ్నించడంతో శత్రుత్వం పెరిగిందని బాధితుడు తెలిపారు. అదే రోజు రాత్రి 10 గంటల సమయంలో రఘుదేవపురం పుంత స్మశానం వద్ద నలుపు రంగు ఫార్చునర్ వాహనం, మోటార్ సైకిళ్లతో అడ్డగించి సుమారు 20 మంది మద్యం మత్తులో కులపేరుతో దూషిస్తూ చంపుతామని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అర్ధరాత్రి 1 గంట వరకు నిర్బంధించిన అనంతరం పోలీసులు చేరుకొని ప్రాణాలతో రక్షించారని తెలిపారు. నిందితులపై అటెంప్ట్ టు మర్డర్ కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ, ఘటనకు సంబంధించిన వీడియోలు తన వద్ద ఉన్నాయని పోలీసులకు సమాచారం అందించారు.


FIRST INFORMATION REPORT
(Under Section 173 BNSS)
A.P.P.M. Orders 470,500
1. District East Godavari P.S. Seethanagaram Year 2026 FIR No. 20/2026 Date 28/01/2026
2. Acts & Section(s): 126(2),351(3) r/w 3(5) BNS
3. a) Occurrence of Offence: Day Sunday Date & Time From 25/01/2026 22:00
Date & Time To Prior To Time Period
b) Information Received at P.S.: Date & Time 28/01/2026 12:00
c) General Diary Reference: Entry No 5 Date & Time 28/01/2026 12:00
4. Type of Information: Written
5. Place of Occurrence:



## ఆర్టీవో కార్యాలయం 9వ వార్షికోత్సవం వేడుకలు

**వాహన దారులకు సేవలు అందించడమే మా ధ్యేయం: ఆర్టీవో వి జయప్రకాష్**


**అగనంపూడి (జయ జయహే)**

అగనంపూడి ఆర్టీవో కార్యాలయం 9వ వార్షికోత్సవం సందర్భంగా అగనంపూడి లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీవో కార్యాలయం లో కేక్ కటింగ్ కార్యక్రమం చేసారు ఈ కార్యక్రమం లో ఆర్టీవో,మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్స్ మరియు ఆఫీస్ స్టాఫ్ ను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆర్టీవో వి జయ ప్రకాష్ మాట్లాడుతూ అగనంపూడి ఆర్టీవో కార్యాలయం ప్రారంభం నాటి నుండి నేటి వరకు 1 లక్ష 23 వేల 150 వెహికల్స్ కి వివిధ రకాల సేవలు అందించడం జరిగిందని వాహనదారులు కు మెరుగైన సేవలు అందించడమే మా ద్వేయమని రవాణా శాఖ నిబంధనలో అనుసరించాలని కోరారు. 9వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేసారు ఏడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్, బీహెచ్‌ఈఎల్, గంగవరం పోర్ట్, వి ఈ పి జెడ్, ఆటోనగర్ ప్రాంతంలో వాహనాలు ఎక్కువగా ఉండటం వల్ల వాహనదారులకు సౌలభ్యంగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకొని అగనంపూడిలో ఆర్టీవో కార్యాలయం 38 లక్షల ప్రభుత్వ నిధులతో కట్టించడం జరిగినది. వాహనదారుల తరఫున ఎమ్మెల్యే కు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. అగనంపూడి లారీ ఓనర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులు లక్కరాజు గోవిందరాజు సభ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గాజువాక స్టీల్ సిటీ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు నెల్లి శ్రీనివాసరావు, టిడిపి సీనియర్ నాయకులు కొర్రాయి నాగార్జున మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్స్ డిపి రంగారావు, ఎన్ శ్రీనివాస్, జి సత్యం నాయుడు, వై లలిత, జి సృజన ఆఫీస్ స్టాఫ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విందుల నర్సింగరావు ముమ్మని అప్పారావు, ఎం శ్రీను, గొన్న తాతారావు, బొబ్బరి ప్రవీణ్ కుమార్, గోపిశెట్టి సత్య రావు, గొన్న గోపి, సలాది శ్రీనివాస, పినబాల మహేష్

# ఆలయానికి కంబాల రూ. లక్ష విరాళం

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

కొంతమూరు మండలం రాజమండ్రి రూరల్ పరిధిలోని కోరుకొండ రోడ్, కొంతమూరు గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ వారాహి దేవి పీఠం ప్రథమ వార్షికోత్సవ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆజ్ఞా పీఠికతో పాటు ప్రత్యేక పూజలు చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జనవరి 26 నుంచి 28 వరకు శ్రీ సుదర్శన యజ్ఞం, హోమాలు, విశేష పూజలు జరగనుండగా, 28న ప్రత్యేక అభిషేకం, మహా మంగళహారతి నిర్వహిస్తామని పేర్కొన్నారు.ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాస్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ, అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుఖశాంతులు, ఐశ్వర్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని



పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆలయానికి లక్ష రూపాయల విరాళం అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవి అనుగ్రహం పొందాలని ఆలయ నిర్వాహకులు కోరారు.



## జనవాణికి వచ్చే ఫిర్యాదులు సత్వరమే న్యాయం చేకూర్చాలి

**ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్**

**యలమంచిలి, జయ జయహే న్యూస్**

జనవాణికి వచ్చే ఫిర్యాదులు సత్వరమే న్యాయం చేకూర్చే విధంగా అధికారులు పనిచేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ గెస్ట్ హౌస్ లో జనవాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవాహినికి వచ్చే ఫిర్యాదులు మరోసారి వచ్చే విధంగా ఉండకుండా పనులు జరగాలని అధికారులకు సూచించారు. ప్రజా నుండి వినతులను స్వీకరించి సంబంధిత అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలపై జనానికి వచ్చాక మరొకసారి రాకుండా పని పూర్తి చేసి పంపించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు కూటమి నాయకులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ అందజేసిన ఎమ్మెల్యే విజయ్ కుమార్

**యలమంచిలి, జయ జయహే న్యూస్**

పట్టణంలోని జడ్పీ గెస్ట్ హౌస్లో బుధవారం ఎమ్మెల్యే ఛాంబర్లో ఏర్పాటు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ 9 మంది బాధితులకు రూ. 2.20 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ..సమస్యలు ఉంటే ప్రతి బుధవారం జడ్పీ గెస్ట్ హౌస్లో అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అనకాపల్లి ఉత్సవాలను విజయవంతం చేయండి

**ప్రగడ నాగేశ్వరరావు**

**యలమంచిలి, జయ జయహే న్యూస్**

అనకాపల్లి ఉత్సవాలను విజయవంతం చేయాలని ప్రగడ నాగేశ్వరావు అన్నారు. బుధవారం అచ్యుతాపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, యలమంచిలి నియోజవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు అధ్యక్షతన మండల అధ్యక్షులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల గెలుపే లక్ష్యంగా పార్టీని పటిష్టం చేసి ముందుకు తీసుకువెళ్లాలని, ప్రతి పంచాయతీలోనూ, వార్డులలో ఎన్నికలకు సంసిద్ధం కావాలని అన్నారు. ఇప్పటినుండి గ్రామాలలో ప్రజలతో మమేకమై సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, రాష్ట్ర అభివృద్ధికి చేస్తున్న కృషిని ప్రశంసించారు.

## ఐతం అధ్యాపకునికి అంతర్జాతీయ గుర్తింపు

**కళాశాల యాజమాన్యం ప్రశంసలు**

**టెక్కలి జనవరి 28 జయ జయహే**



అంతర్జాతీయ స్థాయిలో విశేష గుర్తింపు పొందిన ఐతం కళాశాల సిఎస్సి ఇ విభాగం అధ్యాపకులు డాక్టర్ యు డి ప్రసన్న సింగపూర్ కు చెందిన ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయం నుండి అడ్వాన్సింగ్ ఇమేజ్ సిస్టం విత్ ట్రాన్స్ఫు ఫార్మర్ బెస్ట్ అటెన్షన్ మెకానిజం అనే ఆధునిక అంశంపై పోస్ట్ డాక్టోరల్ పరిశోధన విజయవంతంగా పూర్తి చేసి ఘనత సాధించినందుకు ఐతం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి వి నాగేశ్వరరావు అభినందించారు. ఇటువంటి పరిశోధనాత్మక విజయాలు కళాశాల అకాడమిక్ ప్రతిష్టలను జాతీయ అంతర్జాతీయ స్థాయిలో విజయవంతం మరింత ఘనత పెంచిందని ఆయన అన్నారు, ఇవి విద్యార్థుల సృజనాత్మకతను పరిశోధనాభి రుచిని పెంపొందిస్తాయని పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ ఎస్ శ్రీనివాసరావు అధ్యాపకులు పలువురు పాల్గొన్నారు.

For a pure tomorrow.. జయహో

# ముస్లిం వివాహ పరిచయ వేదికకు చరిత్రాత్మక స్పందన




**విశాఖపట్నం జయజయహే**

ఉచిత సేవలతో వందలాది కుటుంబాలకు ఆశాజ్యోతి ఉ ఇప్పటికే 300కు పైగా వివాహాలు విజయవంతంముస్లిం సమాజంలో పెళ్లిళ్లకు ఎదురయ్యే ఆర్థిక భారాన్ని తగ్గిస్తూ, సరైన సంబంధాలను ఎంపిక చేసుకునే దిశగా ముస్లిం వెల్ఫేర్ సొసైటీ చేపడుతున్న సేవలు ప్రజల మన్ననలు పొందుతున్నాయి. జీవీఎంసీ 42వ వార్డు టీఎస్ఎన్ కాలనీలోని హోటల్ సింకా గ్రాండ్‌లో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సింగ ఆధ్వర్యంలో నిర్వహించిన ముస్లిం వివాహ పరిచయ వేదికకు అనూహ్యమైన, చరిత్రాత్మక స్పందన లభించింది. ఈ వివాహ పరిచయ వేదికకు ఉమ్మడి విశాఖ జిల్లా మాత్రమే కాకుండా విజయవాడ, కాకినాడ, రాజమండ్రి, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ముస్లిం యువతీ-యువకులు తమ తల్లిదండ్రులతో కలిసి హాజరయ్యారు. సంప్రదాయాలకు భంగం కలగకుండా, పరస్పర గౌరవం, అంగీకారంతో సంబంధాలు ఏర్పడేలా ఈ వేదికను సొసైటీ ప్రత్యేకంగా రూపొందించింది. యువతీ-యువకులు తమ విద్యా అర్హతలు, వృత్తి వివరాలు, కుటుంబ నేపథ్యాలను స్వయంగా వివరించుకుని, తల్లిదండ్రుల సమక్షంలో సంబంధాలను ఎంపిక చేసుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పెద్దలు మాట్లాడుతూ, ఈ తరహా వివాహ పరిచయ వేదికలు సమాజానికి ఎంతో అవసరమని, ముఖ్యంగా మధ్యతరగతి, పేద కుటుంబాలకు ఇవి వరంగా మారుతున్నాయని పేర్కొన్నారు. ఉపాధ్యక్షులు హాజీ మీరా అబ్బాస్ హుస్సేన్, రేహామతుల్లా బేగ్ మునీర్ ఖాన్, అడ్వకేట్ రజాక్ తదితరులు మాట్లాడుతూ, ముస్లిం వెల్ఫేర్ సొసైటీ సేవలు యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కొనసాగుతున్నాయని ప్రశంసించారు. ఈ సందర్భంగా సొసైటీ వైస్ ప్రెసిడెంట్ హాజీ మీర్ అబ్బాస్ హుస్సేన్ మాట్లాడుతూ, తమ సొసైటీ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 11 సార్లు ఉచిత వివాహ పరిచయ వేదికలు నిర్వహించామని, వాటి ఫలితంగా సుమారు 300కు పైగా వివాహాలు విజయవంతంగా కుదిరి కుటుంబాలు ఒక్కటయ్యాయని వెల్లడించారు. ఈ రోజు నిర్వహించిన వేదికలో సుమారు 200 మంది యువతీ-యువకులు తమ తల్లిదండ్రులతో కలిసి పాల్గొన్నారని తెలిపారు.

ఈ వివాహ పరిచయ వేదిక పూర్తిగా ఉచితమని, ఇందులో ఎటువంటి ఫీజులు వసూలు చేయడం లేదని స్పష్టం చేశారు. అంతేకాకుండా, హోటల్ సింకా గ్రాండ్ యాజమాన్యం ఈ సేవా కార్యక్రమాన్ని గుర్తించి వేదికను ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. ఈ వేదిక ద్వారా కుదిరిన అనేక వివాహాలకు ఆహ్వానాలు అందుతుండటం తమకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని తెలిపారు.

దూర ప్రాంతాల నుంచి వచ్చే కుటుంబాలకు భోజన సదుపాయం ఏర్పాటు చేయడంతో పాటు, పేద ముస్లిం కుటుంబాలకు తమ సొసైటీ తరపున షాదీ ఖర్చులు భరించి వివాహాలు జరిపిస్తున్నామని వివరించారు. ఈ ఉచిత వివాహ పరిచయ వేదికకు వస్తున్న స్పందనను దృష్టిలో పెట్టుకుని, ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో కూడా ఇలాంటి కార్యక్రమాలను విస్తరించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే గుంటూరులో ఈ తరహా వేదికను ప్రారంభించడం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమంలో సొసైటీ గౌరవ అధ్యక్షుడు మునీర్ ఖాన్ బాబా, వైస్ ప్రెసిడెంట్ హాజీ మీర్ అబ్బాస్ హుస్సేన్, కార్యదర్శి సయ్యద్ అమీర్ జాన్, జాయింట్ సెక్రటరీ అలీఖాన్, కోశాధికారి అహమ్మద్ వలి, అడ్వకేట్ రజక్ కమిటీ సభ్యులు అబ్దుల్ మునీర్, ముషాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అనేక ముస్లిం కుటుంబాలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి, సొసైటీ సేవలకు అభినందనలు తెలిపారు.



## ఘనంగా గౌరీ పరమేశ్వరుల సారీ ఊరేగింపు మహోత్సవం

**అనకాపల్లి జయ జయహే**

140 సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ లోని ఏక రాత్రి ఉత్సవంగా ప్రసిద్ధి చెందిన అనకాపల్లి గవరపాలెం శ్రీశ్రీశ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవ రాజం శనివారం 31వ తేదీ నాడు ఘనంగా జరపనున్నారు. ఈ ఉత్సవం పురస్కరించుకుని బుధవారం పట్టణంలో గౌరీ పరమేశ్వరుల సారి ఊరేగింపు మహోత్సవం మేళతాళాలతో, మంగళ వాయిద్యాలు, తాడిపెద్ద సేవ, సంస్కృతి క కార్యక్రమాలతో భారీ ఊరేగింపు పట్టణ పురవీధుల గుండా సుమారు 2000 మంది మహిళలతో సారే ఊరేగింపు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ నాయకులు భీమరశెట్టి రామ్ కి కూటమి సభ్యులు, ఆలయ పాలకవర్గ సభ్యులు పాల్గొనడం జరిగింది.

## 9 మంది మత్స్యకారుల విడుదలకు తక్షణ చర్యలు

### మంత్రి అచ్చెన్నాయుడు వినతితో స్పందించిన సీఎం

### కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సీఎం లేఖ

**అమరావతి, జనవరి 27:(జయ జయహే)**



విజయనగరం జిల్లాకు చెందిన 9 మంది మత్స్యకారులను బంగ్లాదేశ్ నౌకాదళం అరెస్టు చేసిన ఘటనను రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా, ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా కు లేఖ రాసి మత్స్యకారుల విడుదలకు అవసరమైన దౌత్య చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు విజయవాడలోని క్యాంప్ కార్యాలయం నుండి మాట్లాడుతూ, విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌కు చెందిన మెకానైజ్డ్ ఫిషింగ్ బోట్ అక్టోబర్ 13, 2025న ఉదయం 4 గంటలకు లోతు సముద్ర చేపల వేటకు బయలుదేరిన సమయంలో, అందులో ఉన్న 9 మంది మత్స్యకారులు వాతావరణ పరిస్థితులు, సముద్ర ప్రవాహాల కారణంగా అనుకోకుండా అంతర్జాతీయ సరిహద్దులు దాటారని తెలిపారు. ఈ క్రమంలో బంగ్లాదేశ్ నౌకాదళం వారిని అరెస్టు చేసినట్లు వివరించారు. అక్టోబర్ 22, 2025న సమీప ప్రాంతంలో వేట చేస్తున్న మరో పడవ సిబ్బంది ద్వారా ఈ విషయం వెలుగులోకి వచ్చిందని, అప్పట్లో పడవ డ్రైవర్ బంగ్లాదేశ్ నౌకాదళం తమను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపినట్లు మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో అరెస్టయిన 9 మంది మత్స్యకారుల కుటుంబాలు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నాయని పేర్కొన్న మంత్రి అచ్చెన్నాయుడు, రాష్ట్ర ప్రభుత్వం వారి పక్షాన నిలబడి కేంద్రంతో నిరంతరం సమన్వయం చేస్తూ మత్స్యకారుల త్వరిత విడుదల కోసం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.

## శ్రీముగ్ధకు 'గూగుల్' ప్రశంసలు!

### 'టెక్‌స్ప్రింట్ 2025-26'లో పాల్గొన్న అనిట్స్ విద్యార్థిని

**విశాఖపట్నం, జనవరి 28, జయ జయహే:**



'అనిట్స్' కళాశాలలో ఇంజినీరింగ్ (ఏఐ) ఆఖరి సంవత్సరం కోర్సు చదువుతున్న విద్యార్థిని ఉప్పల శ్రీముగ్ధకు 'గూగుల్' సంస్థ నుంచి ప్రశంసలు దక్కాయి. గూగుల్ డెవలెపర్ గ్రూప్ (క్యాంపస్.వి.జి.ట్) సంస్థ ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన 'టెక్‌స్ప్రింట్ 2025-26'లో శ్రీముగ్ధ పాల్గొంది. ఆ సంస్థ ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన 'హ్యాకథాన్'లో భాగంగా ఐదుగురి బృందంలో ఒకరిగా శ్రీముగ్ధ ప్రతిభ కనబర్చిందంటూ గూగుల్ సంస్థ అభినందించింది. ఈ మేరకు ఆమెకు ప్రశంసాపత్రాన్నీ పంపించింది. దీంతో శ్రీముగ్ధను ఆమె కుటుంబ సభ్యులతో పాటు సహచర విద్యార్థులు, కళాశాల యాజమాన్యం పొగడ్తలతో ముంచెత్తింది. భవిష్యత్తులో ఆమె వివిధ హ్యాకథాన్లలో టాప్-10లో నిలవాలంటూ పలువురు ఆకాంక్షించారు.



# జనవాసాల మధ్యలో తారు ప్లాంట్

## అనారోగ్యాలతో ప్రజలు

**చోడవరం జనవరి 28, జయ జయహే**

చోడవరం నియోజవర్గ పరిధిలో గల రావికమతం మండలం కొత్తకోట గ్రామంలో జనావాసాల మధ్య తారు ప్లాంట్ ని నిర్మించి 24 గంటలు రహదారి మెటీరియల్ను తయారు చేస్తుండడం వలన విపరీతమైన కాలుష్యం వెలువడి గ్రామంలో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. దీంతో ఊపిరితిత్తుల సమస్యల బారిన పడుతున్నామని కావున ఈ ప్లాంట్ ని ఆపివేయాలని కోరుతూ గ్రామస్తులు చోడవరం జనసేన పార్టీ ఇంచార్జ్ పీవీఎస్ఎన్ రాజు దృష్టికి బుధవారం తీసుకు వచ్చారు. దీంతో ప్లాంట్ ని ప్రత్యక్షంగా పరిశీలించిన రాజు అక్కడున్న పరిస్థితిని చూసి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేయడం జరిగింది. ఎలాంటి అనుమతులు లేకుండా కనీస కాలుష్య ప్రమాణాలు పాటించకుండా నిరంతరం ఈ ప్లాంట్ ద్వారా మెటీరియల్ తయారు చేయడం వల్ల వందల మంది ప్రజలు అనారోగ్య బారిన పడటంతో పాటు ఆ ధూళి దుమ్ము సమీపంలో ఉన్న వాటర్ ట్యాంకులో చేరి ఆ కలుషిత నీరు తాగడం అలాగే వారి ఇళ్ళు అన్నీ కూడా మసిబారిపోవడం జరిగిందన్నారు. కొంతమంది తీవ్ర జ్వరాలు దగ్గుతో బాధపడడం కూడా తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ పరిస్థితిని చూసిన తర్వాత అక్కడ నుంచే రాజు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మెంబర్ పంచకర్ల సందీప్ తో మాట్లాడి పూర్తి వివరాలను తెలియజేసి ఆయన సూచన మేరకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇంజనీర్ కి పరిస్థితిని లిఖితపూర్వకంగా తెలియజేశామన్నారు. పొల్యూషన్ అధికారులు వచ్చి ఇక్కడ ఉన్న వాయు ధ్వని కాలుష్యాలకి సంబంధించి తుది నిర్ణయం తీసుకునే వరకు ఈ ప్లాంట్ ను ఆపేయమని ప్లాంట్ యాజమాన్యానికి సూచించడం తో తాత్కాకంగా ప్లాంట్ నిలుపు చేశారు. ఈ ప్లాంట్ వలన తారు రోడ్డు నిర్మాణానికి అవసరమైన మెటీరియల్ తయారవ్వడం అవసరమే గాని జనావాసాల మధ్య ఈ ప్లాంట్ నిర్మించడం సరైనది కాదని అవసరమైతే దూరంగా ప్లాంట్ నిర్మించాల్సి ఉంటుందని సదరు మేనేజ్మెంట్ కి తెలియజేశామని రాజు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ జనసేన పార్టీ నాయకులు, చింతల కిషోర్, లొట్ల శివ , పాసపు నగేష్ , గర్రెడ్డి దివాకర్ , సోమిరెడ్డి రాజు , గ్రామస్థులు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు

# ఎమ్మెల్యేలు.. ఇచ్చిన మాట నిలబెట్టుకోండి

**చోడవరం జనవరి 28, జయ జయహే**



సమస్యలు పరిష్కారం కోరుతూ గోవాడ సుగర్స్ కార్మికులు రైతులు దీక్షలు చేపట్టిన నేపథ్యంలో స్పందించిన చోడవరం మాడుగుల ఎమ్మెల్యేలు ఫ్యాక్టరీ విషయంలో నాకు హామీ ఇచ్చారని ఆ మాట నిలబెట్టుకోవాలని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి దండుపాటి తాతారావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఇద్దర ఎమ్మెల్యేలకు బహిరంగ లేఖ రాశారు. రైతులకు సబ్సిడీతో కూడిన దవ్వ లేదా పిలకలు ( మొక్కలు) సరపరా చేయాలనీ కోరారు. అయితే మీరు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాల్చిన బాధ్యత మీ ఇరువురిపై ఉందన్నారు. ముఖ్యంగా ప్యాక్టరీని బాగుచేయాల్చి ఉందనీ, అయితే 400000 నుండి 500000 టన్నుల కెపాసిటీ లేదా అంతకంటే ఎక్కువ కెపాసిటీ తో ఫ్యాక్టరీ ఆదునీకరణ చేయాలనీ కోరారు. మీరు ఇచ్చిన హామీ మేరకు అఖిలపక్షం కమిటీ వారు దీక్షలు విరమించారని చెప్పారు. ఫ్యాక్టరీ ఆధునికరణకు అవసరమైన నిధుల విడుదల చేయాలని, మరియూ "విత్తన సేకరణ మరియూ సరపరా" పిబ్రవరి నెల నుండే మొదలుపెట్టే ఆచరణ తప్పకుండా అమలు చేయాలన్నారు. అందుకు అవసరమైన దుక్కు చేసుకొని సిద్ధంగా ఉండాలని రైతులకు, బహిరంగ ప్రకటన ద్వారా ఇద్దరు మీూా లు దృఢమైన బరోసా ఇవ్వాలనీ కోరారు. ఈ కార్యాచరణ పిబ్రవరి మొదటి వారంలోనే ప్రారంభించాలని ఇందుకు పత్రిక ప్రకటన చేయాలని కోరారు.


# గంజాయి అక్రమ రవాణా కేసులో నలుగురు నిందితులకు 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

## రూ.1 లక్ష జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించిన చోడవరం కోర్టు

**చోడవరం జనవరి 28, జయ జయహే**



గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న నిందితులకు అనకాపల్లి జిల్లా చోడవరం తొమ్మిదవ అదనపు జిల్లా కోర్టు చారిత్రాత్మక తీర్పునిచ్చింది. ఈ కేసులో నలుగురు నిందితులకు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు భారీ జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎం.హరినారాయణ తీర్పు వెలువరించారు. ఈ మేరకు అనకాపల్లి ఎస్పీ తుహీన్ సిన్హా అందించినకేసు వివరాలు పరిశీలిస్తే2017 జనవరి 8వ తేదీ ఉదయం కొత్తకోట పోలీస్ స్టేషన్ పరిధిలో 80 కేజీల గంజాయిని రెండు మోటార్ సైకిల్ పై అక్రమంగా తరలిస్తున్న నిందితులను దొండపూడి చెక్ గేట్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. దర్యాప్తు అధికారి ఎస్సై డి.శేఖరం కేసును లోతుగా దర్యాప్తు చేసి, పక్కా ఆధారాలతో కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. నిందితులపై మోపబడిన నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితులు బలి ఘటానికి చెందిన పెంట శ్రీనివాసరావు, బుచ్చంపేటకు చెందినవలబుల నూకరాజు, (చిన్నబ్బాయి),సుర్ల రమణ, మున్నిపల్లికి చెందిన కర్రి రామారావు లుగా పేర్కొన్నారు. ప్రతి నిందితునికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష తో పాటు రూ. 1,00,000లు జరిమానా చెల్లించాలి. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఏడాది సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున సమర్థవంతంగా వాదనలు వినిపించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చీపురపల్లి సూర్యనారాయణ కేసును పకడ్బందీగా దర్యాప్తు చేసిన అధికారులను, కొత్తకోట పోలీస్ సిబ్బందిని, కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బందిని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రత్యేకంగా అభినందించారు. మాదకద్రవ్యాల రవాణాకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు.



# గీతం భూకబ్జాపై మహాధర్నాను జయప్రదం చేయండి

## 30న జీవీఎంసి వద్దకు తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి పిలుపు..

**విశాఖపట్నం (జయ జయహే)**

విశాఖ గీతం యూనివర్సిటీ కి ఆక్రమిత భూముల క్రమబద్ధీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 30 న జీ వీ ఎం సి గాంధీ విగ్రహం వద్ద 11 గంటలకు జరిగే మహా ధర్నా జయప్రదం చేయాలనీ మాజీ మాజీ ఎమ్మెల్యే , వైసీపీ విశాఖ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్తవాసుపల్లి గణేష్ కుమార్ కోరారు. ఆసీలమెట్ట పార్టీ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండ రాజీవ్ గాంధీ తో కలిసి దక్షణ శ్రేణుల సమన్వయ సమావేశంలో అయన మాట్లాడారు. విశాఖ రూరల్ మండలం, ఎండాడ, ఋషికొండ గ్రామాల్లోని గీతం అక్రమణలో ఉన్న విలువైన 54.79 ఎకరాలు ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. గీతం విశ్వ విద్యాలయం, గీతం హాస్పిటల్ యాజమాన్యం ఆక్రమణలో ఉన్న ఎండాడ, ఋషికొండరెండు గ్రామాల్లోని మొత్తం విస్తీర్ణం 54 ఎకరాల 79 సెంట్లు ఉంటుందని, వీటి విలువ 5 వేల కోట్లని అయన గుర్తు చేశారు. ఈ భూమిని రెగ్యులైజేషన్ చేసుకోవడానికి ఈనెల 30 వ తేదిన జరిగే జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఆమోదం కోసం 15 వ ఎజెండాగా పెట్టారని పేర్కొన్నారు. ఇది పూర్తిగా అప్రజాస్వామ్యం అని దుయ్యబట్టారు. ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన వారు ప్రభుత్వం, ప్రజలు ఆస్తులు కాపాడవలసినదిపోయి అధికారం అడ్డం పెట్టుకొని ప్రభుత్వం భూములు హారతి కర్పూరంలా స్వాహా చేసే పద్ధతి ఆపాలని అయన కోరారు . గీతంకి ప్రభుత్వ భూములు సంతర్పణ చేయడానికి అక్కడ ఉచిత విద్య అందుబాటులో లేదని స్పష్టం చేశారు. బాధ్యతాయుత మైన ఎం పీ పదవిలో వున్నా శ్రీ భరత్ ఇటువంటి చర్యలకు పాల్పడడం దురదృష్టకరం అన్నారు. మహా ధర్నాకి వైసీపీ నేతలు, కార్యకర్తలు అన్ని అనుబంధ సంఘాలు హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో దక్షిణ వార్డు ప్రెసిడెంట్లు అనుబంధ సంఘాల నాయకులు సీనియర్ నాయకులు మహిళా నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.




## జంతు సంక్షేమ పాక్షోత్సవాలు

**బుచ్చయ్యపేట జయ జయహే**

బుచ్చయ్యపేట మండలం కె. పీ అగ్రహారం గ్రామంలో బుధవారం జిల్లా స్థాయి జంతు సంక్షేమ పాక్షోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెంపుడు కుక్కలకు టీకాలు, 56 పశువులకు గర్భకోస వ్యాధుల చికిత్సలు, 30 సాధారణ చికిత్సలు ,48 పశువులకు పేడ పరీక్షలు చేసి వైద్యం అందించారు, 472 గొర్రెలు మరియు మేకలకు నట్టాల నివారణ మందులు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి శ్రీనివాస్ రావు, ఎంపీటీసీ దేవర అప్పారావు, పాల సంఘం అధ్యక్షుడు టి. వెంకటరమణ, డాక్టర్ జె పద్మజ పశువైద్యాధికారిని ల్యాబ్ టెక్నీషియన్ శ్రీదేవి వైద్య సిబ్బంది పారి రైతులు పాల్గొన్నారు.







## రత్నగిరిపై భక్తులరద్దీ

**అన్నవరం (జయ జయహే)**

కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్య క్షేత్రంగా విరాజిల్లుతున్న అన్నవరం సత్యదేవుని సన్నిధిలో భీష్మఏకాదశి సందర్భంగా భక్తుల రద్దీ అధిక మవడంతోబుధవారం నాడు రాత్రి 8 గంటల నుండి అధిక సంఖ్యలో చేరుకోవడంతో రత్నగిరిపై పలు ప్రాంగణాల్లో ఆరుబయటే విశ్రమించవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. రత్నగిరి పై వసతి సముదాయం తక్కువ సంఖ్యలో ఉండడంవలన భక్తులు స్వామివారి వార్షిక కళ్యాణ మండపంలోఅధికసంఖ్యలో విశ్రమించవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి రద్దీని అధికారులు గమనించి రాత్రి 10 గంటల నుండి టికెట్లువిక్రయించి 12 గంటల నుండి వ్రతాలు ప్రారంభించి స్వామివారి సర్వదర్శనాలు2. గంటల నుండి మొదలుపెట్టారు.

# ఘనంగా పోలమాంబ అంపకోత్సవం

### ఉయ్యాల కంబాల ఉత్సవాన్ని చూసి తరించిన భక్తజనం

### కూచిపూడి నృత్యం తో వనం గుడికి తరలివెళ్లిన అమ్మవారు

**మక్కువ, జనవరి 28, (జయ జయహే):**





వరాలను కురిపించే వరప్రదాయిని... భక్తకోటి కొంగుబంగారం... గిరిజనుల ఆరాధ్య దైవం శంబర శ్రీ పోలమాంబ అమ్మవారి సంబరం లో భాగంగా బుధవారం నాడు అంప కోత్సవం శంబర గ్రామంలో భక్త కోటిని పరవశింప చేసింది. శ్రీ పోలమాంబ కోత్సవాన్ని పురస్కరించుకొని వనం గుడికి చేరారు. బుధవారం ఉదయం పది గంటల ప్రాంతంలో అమ్మవారు యాత్రాస్థలం లో గల గద్దె వద్దకు చేరుకున్నారు. సాంప్రదాయంహాప్రకారం... అమ్మవారి సేవకులు, రివ్వునాయిల్లు, గ్రామ పెద్దలు తోపాటు గ్రామములో చిన్నలు, మహిళలు వేల సంఖ్యలో అమ్మవారి ఉండే గద్దె వద్దకు చేరుకున్నారు. అప్పటికే అమ్మవారి ఉయ్యాల కంబాల ఉత్సవానికి ఊయలను సిద్ధం చేశారు. గద్దె నుండి అమ్మవారిని వేలాది మంది భక్తజనుల మధ్య ఉయ్యాల కంబాల ఉత్సవానికి తీసుకువెళ్లారు. అక్కడ అమ్మవారు పట్టపు మేక ముందు నడవగా మేళతాళాల, డప్పు వాయిద్యాల దరువు పడుతుండగా... మరోపక్క కూచిపూడి నృత్య భాగవత ప్రదర్శన జరుగుతుండగా శ్రీ పోలమాంబ అమ్మవారు ఊయల, కంబాల ఊగారు. ఈ ఉత్సవాన్ని తిలకించిన వేలాదిహాభక్తజనం పరవశించిపోయారు. అమ్మవారి ఉయ్యాల కంబాల ఉత్సవాన్ని కనులారా తిలకించిన భక్తజనానికి జన్మ తరించిపోయింది.హాఅమ్మవారు ఉయ్యాల కంబాల ప్రదేశం నుండి నూతన వస్త్రాలు పై నడుచుకుంటూహావనం గుడికి అంపకోత్స వానికి బయలుదేరారు. ఈ సమయంలో అమ్మవారి నడిచే దారిలో చిన్నారులను తమ తల్లిదండ్రులు పరుండపెట్టి, అమ్మవారి పాదాలు తాకించారు. చిన్నారులకు ఇలా అమ్మవారి పాదాలు తాగితే వారికి ఆయురా ఆరోగ్యంతో పాటు, సిరి సంపదలు, సుఖసంతోషాలు లభిస్తాయనీ ఈ ప్రాంతీయులు నమ్మకం. అమ్మవారు అంపకానికిహా వనం గుడికి అడుగులు వేయగా అమ్మ వెంట వేలాది భక్తజనం అడుగులు వేశారు.





## లక్ష్మీనరసింహునికి పట్టువస్త్రాలు సమర్పించిన డిప్యూటీ ఈ ఓ

**అన్నవరం (జయ జయహే)**

కాకినాడజిల్లా అన్నవరం సత్యనారాయణస్వామివారి దేవస్థానం. తరపునఅంబేద్కర్ కోనసీమజిల్లా అంతర్వేదిలో భీష్మ ఏకాదశి సందర్భంగా. నిర్వహించబోయే లక్ష్మీనరసింహస్వామివారి కళ్యాణ ఉత్సవానికి అన్నవరం దేవస్థానం డిప్యూటీ.ఈఓ. బాబురావు బుధవారంనాడు. స్వామివారికి మరియుఅమ్మవార్లకుపట్టు వస్త్రములు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయఅర్చకులు ఏ. సి. ఎం. టీ. న్. కె. ప్రసాద్. తదితరులు పాల్గొన్నారు ఏ. వి నగరం లో తొండింగిమండలం ఏ. వి నగరంలో వెంచేస్తున్నా శ్రీ దేవిబూదేవి వెంకటేశ్వరస్వామివారి 9వవార్షికోత్సవంలోభాగంగా కళ్యాణం సందర్భంగా బుధవారం నాడు ఉదయం అన్నవరం దేవస్థానం తరపున ఆలయ కార్యనిర్వహణాధికారి వేంద్రత్రినాధరావు మరియు చైర్మన్. ఐ. వి. రోహిత్తోకలిసి స్వామివారికీ మరియు అమ్మవార్లకు పట్టు వస్త్రములుప్రసాదం సమర్పించారు. అనంతరంమాజీమంత్రి యనమలరామకృష్ణ తో ఆలయం గురించిచర్చించిఆలయవిశేషాలు తెలిసుకున్నారు

## గ్రూప్ 2 సాధించిన గుణశేఖర్‌కు కుటుంబ సభ్యులు సంతోష వ్యక్తం

**అరకు: జయ జయహే.**



అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం మత్స్య పురం పంచాయితి ఉప్ప బైరోడి వలస గ్రామానికి చెందిన పెనుమాల గుణశేఖర్ గ్రూప్ -2 విజయం సాధించారు. గ్రూప్-2 ఫలితాల్లో ఆయన ఎక్సిక్యూటివ్ ఆఫిసర్ అసిస్టెంట్ లెబర్ ఆఫిసర్ గా ఆంధ్రప్రదేశ్ జోన్1మొదటి స్థానం లో ఎంపిక అయ్యారు. ఈయన ఎంపిక పట్ల తండ్రి పెనుమాల లింగమూర్తి. విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ లో ఉద్యోగం, తల్లి గృహిణి శశిరేఖ, కుటుంబ సభ్యులు, స్నేహితులు సంతోషం వ్యక్తం చేశారు.



## అనకాపల్లి ఉత్సవంను జయప్రదం చేయండి

**మాడుగుల జనవరి 28, జయ జయహే**

అనకాపల్లి జిల్లా ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా అనకాపల్లి జిల్లాలో ఈనెల 30 31 తేదీల్లో నిర్వహిస్తున్న అనకాపల్లి ఉత్సవం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని ఎంపీపీ టి వి రాజారామ్, ఎండి ఒ కే అప్పారావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం మధ్యాహ్నం మాడుగుల మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, వివోఏ లు అంగన్వాడి కార్యకర్తలతో అవగాహన సమావేశం ఎంపీ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం ఎండిఓ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి బస్టాండ్ లో మనవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎండిఓ ఎంపీపీ మాట్లాడుతూ ఈ ఉత్సవం లో భాగంగా అనకాపల్లి లో కొండకర్ల అవా, బొజ్జన్న కొండ, బెల్లం మార్కెట్, ముత్యాలమ్మ బీచ్ వంటి పలు ప్రాంతాల్లో వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేశారని, సినీ గాయకులచే సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. కాబట్టి ఉద్యోగులతో పాటు ప్రజా ప్రతినిధులు, ప్రజలంతా ఈ ఉత్సవాలు జయప్రదం చేసి అనకాపల్లికి పేరు తేవాలని కోరారు. ముఖ్యంగా ఉద్యోగులు ఈనెల 31న ఓడీతో కూడిన సెలవు తీసుకుని హాజరు కావాలన్నారు.



## గ్రూప్-2 ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు

**మక్కువ, జనవరి 28,(జయజయహే):-**

గ్రూప్ టు లో అర్హత సాధించి , ఉద్యోగాలు పొందిన ఇద్దరు విద్యార్థులను శంబర గ్రామానికి చెందిన ఎంప్లాయిస్ గ్రూపు సభ్యులు అభినందించారు. పార్వతీపురం మన్యం జిల్లా , మక్కువ మండలం శంబర గ్రామానికి చెందిన ఆర్నిపల్లి పోలిరాజు కుమారుడు ఆర్నిపల్లి సంతోష్ కుమార్, ఇదే గ్రామానికి చెందిన గంట బుచ్చియ్య కుమారుడు గంట భాను ప్రసాద్ గ్రూప్ టూ లో అర్హత సాధించిన ఉద్యోగాలు పొందారు. ఆర్నిపల్లి సంతోష్ కుమార్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ , గంట భాను ప్రసాద్ జి ఏ డి అమరావతిలో ఉద్యోగం సాధించారు. వీరిని , వీరి కుటుంబ సభ్యులను శంబర గ్రామానికి చెందిన విశ్రాంతి మండల విద్యాశాఖ అధికారి పెంట సత్యనారాయణ ఆధ్వర్యంలో పూడి లక్ష్మణరావు, తీళ్ల మధుసూధన రావు, తమ్మిరెడ్డి తిరునాధ రావు, పొడిపిపి రెడ్డి సన్యాసినాయుడు, తీళ్ల సతీష్ కుమార్ , అల్లు మన్మధరావు, నైదాన సూర్యనారాయణ, సోమిరెడ్డి వెంకట నాయుడు తదితరులుఎంప్లాయిస్ గ్రూప్ సభ్యులు అభినందించారు. గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టిన ఇరువురి విద్యార్థుల తల్లిదండ్రులను దుస్సాలువతో సన్మానించి , మిఠాయిలు తినిపించి అభినందించారు. పూర్వ విద్యార్థులైన ఆర్నిపల్లి సంతోష్ కుమార్, గంట భాను ప్రసాదలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు నిరంతర కృషి చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.




## డిజిటల్ అసిస్టెంట్లు మరియు వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు ఒక రోజు శిక్షణ

**కొయ్యూరు :(జయ జయహే)న్యూస్ జనవరి 28**

అల్లూరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, ఐటిడిఎ పాడేరు (గిరిజన సంక్షేమ శాఖ) లోని ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ ద్వారా చివరి స్థాయి సేవల అందజేతను బలోపేతం చేసే కార్యక్రమం కింద గ్రామ,వార్డు సచివాలయాల సిబ్బంది అయిన డిజిటల్ అసిస్టెంట్లు మరియు వెల్ఫేర్ మరియు ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో సంక్షేమ పథకాల తిరస్కరణలు వాటి పరిష్కార విధానాలు, ఆధార్‌కు సంబంధించిన సమస్యలు మరియు చివరి స్థాయిలో సేవల అందజేతలో ఎదురయ్యే కార్యనిర్వహణ సమస్యలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ప్రోగ్రాం అమలు అధికారి ఆర్. రామ గోపాల్, అసిస్టెంట్ ప్రోగ్రాం అమలు అధికారులు రాజేష్ మరియు లోహిత్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ తో పాటు కొయ్యూరు మండలం ఎంపిడిఓ కార్యాలయ అధికారులు హాజరయ్యారు.




## కేజీబీవీలో ఫేర్వెల్

**బుచ్చయ్య పేట జయ జయహే**

బుచ్చయ్య పేట మండలం వడ్డాది కేజీబీవీలో 10వ తరగతి మరియు ఇంటర్ సెకండియర్ విద్యార్థులు ఫేర్వెలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో సంతోషంగా ఉల్లాసంగా గడిపారు. గత ఐదు సంవత్సరాలుగా కలిసిమెలిసి చదువుకున్న జ్ఞాపకాలను పిల్లలు గుర్తు చేసుకున్నారు. మండల విద్యాశాఖ అధికారి బి కాశి విశ్వేశ్వర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యంలో చదువుకున్న సన్నివేశాలు తీపి జ్ఞాపకాలు మరల తిరిగి రావని ఆయన గుర్తు చేశారు. 20 ఏళ్లలోపు కష్టపడి చదివితే ఉన్నత భవిష్యత్తుకు ఎదుగుతారని అన్నారు. ఆనాటి కాలంలో ఆడపిల్లలను చదివించేవారు కాదని తెలిపారు. ప్రస్తుతం సమాజంలో మగవాళ్ళకి పోటీగా ఆడపిల్లలు చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించారని ఆయన గుర్తు చేశారు. అలాగే విద్యాసంస్థలు ఎన్ని ఉన్నా కస్తూరిబా పాఠశాలలో విద్యార్థులు అనేకమంది ఉన్నత మైన ఉద్యోగాల్లో ఉన్నారని అయినా తెలిపారు. గత డీఎస్సీలో ఎక్కువమంది ఉద్యోగాలు సాధించిన వారిలో కస్తూరిబాయ్ విద్యార్థుల్లో ఉన్నారని ఆయన అన్నారు. కస్తూరిబాయ్ విద్యాలయంలో చదివిన పిల్లలు అని రంగాల్లోనూ ఉంటారని తెలిపారు. విద్యార్థులు తమ పాఠశాలలో చదివిన జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. వెళ్ళిపోతున్న విద్యార్థులు కి ఉన్న విద్యార్థులు వీడ్కోలు పలికి జ్ఞాపకాలని అందజేశారు. స్కూల్ అభివృద్ధి గురించి విద్యాలయ ఉన్నత ప్రమాణాలను మెరుగుపరిచిన విద్యాశాఖ అధికారి కాశి విశ్వేశ్వరరావుని స్కూల్ చైర్మన్ ఎడ్ల సత్యవేణి నీ విద్యార్థులు శాలువా కప్పి అభినందించా.రు ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది స్కూల్ కమిటీ నెంబర్లు ఎడ్ల రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



## పీఎం ఉషా-జీఐఈఐ పథకం ద్వారా మహిళలకు శిక్షణ ప్రారంభం

**మరిపాలెం:(జయ జయహే)**

ప్రధానమంత్రి ఉషా ఉజీఐఈఐ పథకం లో భాగంగా 15 రోజుల టైలరింగ్ మరియు బొటిక్ సర్టిఫికెట్ కోర్సును గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, మరిపాలెం లో గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. సుధ ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. కె. సుధ మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో విద్యతో పాటు నైపుణ్య శిక్షణ ఎంతో అవసరమని, టైలరింగ్ వంటి వృత్తి నైపుణ్యాలు విద్యార్థులకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తాయని తెలిపారు. ముఖ్యంగా బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా ఏవి. సూర్య కుమారి (మాస్టర్ ట్రైనర్ & ఫ్యాషన్ డిజైనర్) హాజరై, టైలరింగ్ ప్రాముఖ్యతను వివరించారు. కుట్టు యంత్రం నిర్వహణ, వస్త్రాల కటింగ్ వంటి ప్రాథమిక అంశాలను విద్యార్థులకు ప్రాయోగికంగా బోధించారు.ఈ శిక్షణ కార్యక్రమాన్ని సీఎంఎస్ ల్యాబొరేటరీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహించగా, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, పాడేరు (ఏఎస్ఆర్ జిల్లా) ప్రిన్సిపాల్ మరియు చైర్‌పర్సన్ డా. వి. చిట్టి అబ్బాయి పర్యవేక్షణలో కార్యక్రమం సాగింది. ఈ శిక్షణకు ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా డా. పుష్ప ధనుంజయ్ , సబ్ కోఆర్డినేటర్‌గా కుమారి భువనేశ్వరి దేవి వ్యవహరించారు.

For a pure tomorrow.. జయహే

# ముస్లిం, మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం






### ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇచ్చేది కూటమి ప్రభుత్వం

### డైరీ ఆవిష్కరణలో మంత్రులు గొట్టిపాటి , ఎన్ఎండి ఫరూక్


**అమరావతి: (జయ జయహే)**

ముస్లిం, మైనారిటీల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఎలక్ట్రిసిటీ ముస్లిం అండ్ మైనారిటీస్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్ 2026 ను అమరావతిలోని సచివాలయంలో సహచర మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తో కలిసి బుధవారం ఆవిష్కరించారు. అనంతరం మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ., ఉద్యోగ సంఘం నేతలు తమ దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలన్నింటినీ సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇచ్చేది కూటమి ప్రభుత్వమేనని మంత్రి గొట్టిపాటి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ముస్లిం, ఇతర మైనారిటీ వర్గాల అభివృద్ధి, అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

అనంతరం మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ.. మైనార్టీ సంక్షేమ బోర్డును మొదటిసారి ఏర్పాటు చేసింది తెలుగు దేశం ప్రభుత్వమే అన్నారు. అదే విధంగా ముస్లింలకు, ఇతర మైనారిటీలకు కూటమి ప్రభుత్వంలోనే రక్షణ ఉంటుందని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడో పోతుందో తెలియని పరిస్థితి ఉండేదన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న సంస్కరణలతో రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ వెలుగులు విరజిమ్ముతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. కడపలో జరిగిన ఇస్తమా వంటి కార్యక్రమాలకు ప్రభుత్వం రూ.1.25 కోట్లు విడుదల చేసిందని, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇలాంటి సంఘటన ఒక్కటి కూడా లేదని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నేతలతో పాటు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# జగ్గంపేట పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం




### ముఖ్య అతిధులుగా మాజీ మంత్రి తోట, బొల్లవరపు జాన్ వెస్లీ

**జగ్గంపేట (జయ జయహే)**

జగ్గంపేట లో రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ విభాగం ఉపాధ్యక్షుడు కుండా జాన్ వెస్లీ ఆధ్వర్యంలో జగ్గంపేట నియోజకవర్గం పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం లో నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ మంత్రి మరియు పార్లమెంట్ సభ్యులు తోట నరసింహం , వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ ముఖ్య అతిథులుగా పాల్గొనడం జరిగింది. ముందుగా ఈ కార్యక్రమంలో బొల్లవరపు జాన్ వెస్లీ ను తోట నరసింహం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో క్రైస్తవులకు జరిగిన ఉపకారాన్ని తెలియజేశారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్రైస్తవులకు కొత్తగా చేసింది ఏమీ లేదని తెలియజేశారు. ఈ కూటమి ప్రభుత్వం మాటలను నమ్మి ఓటేసిన రాష్ట్ర ప్రజలందరూ ఈరోజు బాధపడే పరిస్థితి వచ్చిందని తెలియజేశారు. రాష్ట్రం అప్పులలో కూరుకుపోయిందని అన్నారు. ముఖ్య అతిథి బొల్లవరపు జాన్ వెస్లీ మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు క్రైస్తవులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందని, 416 కోట్ల రూపాయలు జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో క్రైస్తవులకు ఖర్చు చేయడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఇంత మొత్తం ధనాన్ని ఏ ప్రభుత్వం ఇంతవరకు ఖర్చు చేయలేదని తెలియజేశారు. ఈ ప్రభుత్వంలో క్రైస్తవుల మీద దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని రాజ్యాంగం మైనారిటీలకు ఇచ్చిన హక్కులను ఈ కూటం ప్రభుత్వం తుంగలో తొక్కిందని అందుకే క్రైస్తవులపై వేధింపులు ఎక్కువయ్యాయని తెలియజేశారు. రేపు రాబోయే రోజుల్లో క్రైస్తవులందరూ కూడా జగన్మోహన్ రెడ్డి కు మద్దతు పలికి మరల అధికారంలోకి తీసుకొని రావాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలోఉభయగోదావరి జిల్లాల విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ గౌరవ తోట రాంజీ , కాకినాడ జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు దడాల జాషువా గిరి, తూర్పుగోదావరి జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు విజయ సారధి క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర సెక్రటరీ మోర్తా శ్రావణ్ కుమార్ ,రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పబ్లిసిటీ విభాగం జనరల్ సెక్రెటరీ రామకుర్తి జగదీశ్వరరావు , కాకినాడ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర కమ్యూనిటీ విభాగం అధ్యక్షుడు గుర్రం మహాలక్ష్మి పాల్గొన్నారు

# రాష్ట్రంలో స్త్రీ శక్తి పథకాన్ని విశేషంగా ఆదరణ

### ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్నాం

### పరిష్కారం కాని ఆర్టీసీ సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తోంది...మంత్రి మండిపల్లి

**అమరావతి (జయ జయహే)**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 15 ఆగస్టు 2025న ప్రారంభించిన స్త్రీ శక్తి పథకం రాష్ట్ర మహిళల జీవితాల్లో చారిత్రాత్మక మార్పుకు నాంది పలికిందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి మాట్లాడుతూ..రాష్ట్రంలో స్త్రీ శక్తి పథకాన్ని విశేషంగా ఆదరణ లభిస్తుందని, 18 నెలలుగా ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తు.. స్త్రీ శక్తి పథకం మహిళలకు సంపూర్ణ సంతృప్తిని ఇస్తోందనీ, స్త్రీ శక్తి పథకాన్ని పూర్తి బాధ్యతతో, పారదర్శకంగా అమలు చేస్తున్నామని, గత ఐదేళ్లుగా పరిష్కారం కాని ఆర్టీసీ సమస్యలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తోందని పేర్కొన్నారు.ఈ పథకం ద్వారా మహిళలకు, ట్రాన్స్‌జెండర్స్‌కు పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించబడిందని తెలిపారు. ఇప్పటివరకు 40 కోట్ల మంది మహిళలు ఈ సదుపాయాన్ని వినియోగించుకున్నారని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ఆర్టీసీకి రూ.1,388 కోట్ల సబ్సిడీ అందించిందన్నారు.పథకం అమలుతో బస్సుల్లో మహిళా ప్రయాణికుల శాతం 40 శాతం నుంచి 63.4 శాతానికి, రోజువారీ మహిళా ప్రయాణికుల సంఖ్య 16.11 లక్షల నుంచి 24.14 లక్షలకు పెరిగిందని తెలిపారు. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా 1,413 అదనపు ట్రిప్పులు, 64,647 అదనపు కిలోమీటర్లు ఆపరేట్ చేస్తున్నామని చెప్పారు.






ప్రయాణికుల సౌకర్యార్థం 63 బస్ స్టేషన్లలో ఆర్.ఓ. వాటర్ ప్లాంట్లు, మరుగుదొడ్ల పునరుద్ధరణకు 152 బస్ స్టేషన్లకు రూ.24 కోట్లు వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశం అనంతరం ఉత్తమ సేవలు అందించిన అధికారులకు మంత్రి ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా విజయవాడలో ఏపీఎస్ఆర్టీసీ నూతన కార్గో కౌంటర్‌ను మంత్రి ప్రారంభించారు.స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళల ఆర్థిక భారం తగ్గడంతో పాటు వారి స్వావలంబన, భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.



# పోలమాంబ అమ్మవారి పాలకమండలి ప్రమాణ స్వీకారం

### ఆలయం ఛైర్మన్‌గా మద్ది శ్రీను

**విశాఖపట్నం. జయ జయహే**

తూర్పు నియోజకవర్గం శాసన సభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు అధ్యక్షతన నూతన పాలక మండలి వి. శ్రీనివాస్, పి. శాంతి,కె. వరలక్ష్మి, జి పద్మ, కె. సత్య కౌశల్య రాణి, పి. అనిల్ కుమార్, పివాసు ,ఏ.మంగరాజు,వి ఉమా, యం.శ్రీనివాస్ రావు కొలువు తీరింది.శ్రీ పొలమాంబ అమ్మవారి దేవస్థానం నూతన పాలక మండల సభ్యులు మద్ది శ్రీను ను అధ్యక్షులుగా ఎన్నుకున్నారు . దేవస్థానం ఈ. ఓ గౌరీ దేవీ నూతన సభ్యులచే ప్రమాణం స్వీకారం చేయించారు.విశాఖ పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చోడే పట్టాభిరామ్ , ఉపాధ్యక్షులు బొట్టరమణ,మీడియా కోఆర్డినేటర్ పోతన రెడ్డి,మాజీ కార్పొరేటర్ బొట్ట నీలిమ, శ్రీ కనకదుర్గ టెంపుల్ ఛైర్మన్ మూర్తి యాదవ్,పీతల అమరేంద్ర సీనియర్ నాయకులు కళ్ళ శంకర్ కూటమి నాయకులు తదితరులు పాల్గున్నారు



# అలరించిన కూచిపూడినృత్యం

**అన్నవరం (జయ జయహే)**

కాకినాడజిల్లా అన్నవరం సత్యదేవుని సన్నిధిలో భీష్మఏకాథశి సందర్భంగా బుధవారంనాడు సాయంత్రం కళామందిర ప్రాంగణంలో కావ్యశ్రీనృత్యకళాశాల ఆధ్వర్యంలో 100మంది కూచిపూడినృత్యప్రదర్శన ఇచ్చారు. ఈ చిన్నారులు హైదరాబాద్ నందు గచ్చిబౌలిస్టేడియంలో ఇచ్చిననృత్య ప్రదర్శనకు గిన్నీస్ బుక్ అఫ్ రికార్డ్ కభించిందని కళాశాల నిర్వాహకురాలు ఏలూరు దీపికా తెలి పారు



# పిఠాపురం రైల్వే స్టేషన్‌ను మోడల్‌గా అభివృద్ధి

### పిఠాపురం నుంచి కాకినాడకు నేరుగా రైలు

### కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరిన డిప్యూటి సిఎం పవన్

**(జయ జయహే)**

ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన పిఠాపురం రైల్వే స్టేషన్‌ను మోడల్ రైల్వే స్టేషన్‌గా అభివృద్ధి చేయాలని పవన్ విజ్ఞప్తి చేశారు. శక్తిపీఠం, పాదగయ, శ్రీపాద వల్లభస్వామి ఆలయాలు ఉన్న ఈ పట్టణానికి తగిన మౌలిక వసతులు, ఆధునిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బిజీబిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా కేంద్ర రైల్వే, సమాచార, ప్రసార శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్‌తో పవన్ సమావేశమయ్యారు. పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన అనేక కీలక అంశాలపై ఈ సమావేశంలో వినతిపత్రం సమర్పించారు. పిఠాపురం నుంచి కాకినాడకు నేరుగా రైలు కనెక్టివిటీ ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం సామర్లకోట మీదుగా వెళ్లాల్సి ఉండటంతో ప్రయాణికులు, సరుకు రవాణాకు ఎక్కువ సమయం పడుతోందని, అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని కేంద్రమంత్రికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. పీఎం గతి శక్తి పథకం కింద పిఠాపురం పరిధిలో సామర్లకోట - ఉప్పాడ రోడ్డుపై రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం త్వరగా చేపట్టాలని కోరిన పవన్.. ఇది ట్రాఫిక్ సమస్యలను తగ్గిస్తుందని అన్నారు. జాతీయ రైల్వే ప్రణాళిక - 2030లోని మాన్యువల్ లెవల్ క్రాసింగ్‌లను తొలగించాలనే లక్ష్యాలకు అనుగుణంగా ఉంటుందని పవన్ వివరించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా పవన్ కళ్యాణ్ మరికొంత మంది కేంద్రమంత్రులతో భేటీ అవనున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పవన్ సమావేశమవుతారు. అలాగే కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్‌తో డిప్యూటీ సీఎం భేటీ అవనున్నారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలని ఈ సందర్భంగా కేంద్రమంత్రులను ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కోరనున్నట్లు తెలుస్తోంది.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com